నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 26-7-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:282 పేజీలు:6 వెల: రూ.1/-

పంతులమ్మ అవతారమెత్తిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూ డిల్లీ జూలై 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);నిత్యం అధికారిక కార్యక్రమాలతో బిజీ బిజీగా ఉండే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పంతులమ్మ అవతారమెత్తారు ఢిల్లీలోని ఓ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించారు.ఢిల్లీలోని ప్రెసిడెంట్స్ ఎస్టేట్‌లో ఉన్న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయాన్ని గురువారం ఉదయం రాష్ట్రపతి సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ బీలోని విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఓ తరగతి గదిలోకి వెళ్లిన ముర్ము.. విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా వారికి పలు ప్రశ్నలు సంధించారు. అదేవిధంగా పాఠశాలలో అందుతున్న విద్య, ఇతర సౌకర్యాల గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

చురక

విపక్ష రాష్ట్రల పైన
వివక్షల విధానం
కనిపిస్తే ఎందుకింక
కప్పిపుచ్చె అవధానం.

సర్కారు ఎవరిదైనా
సమన్యాయం ప్రమోదం
సమతుల్యత లేకుంటే
సమాఖ్యకు ప్రమాదం

9440433475

ఉచిత పథకాల పేరిట భావితరాలపై భారం మోపొద్దు..

-కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ జూలై 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వివిధ వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఉచిత పథకాల్లో స్థిరత్వం తేవాల్సిన అవసరం ఉందని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఉచిత పథకాల అమలుతో భవిష్యత్ తరాలపై భారం మోపవద్దని తెలిపారు. 'మీరు (రాజకీయ పార్టీలు) ప్రకటించే ఉచిత పథకాలను ఈనాడు సమర్థించుకోవచ్చు. కానీ ప్రజాభిప్రాయం ప్రకారం పన్నుచెల్లింపుదారులకు జవాబుదారీగా ఉండాలి. మీరు కొందరు వ్యక్తుల నుంచి పన్ను వసూలు చేసి మరికొందరికి ఇస్తున్నారు. ఉచిత పథకాలకు అర్హులై ఉండాలి' అని పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ సమర్పించిన మరుసటి రోజు టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.ఏది ఏమైనా, ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం నుంచి తాగునీరు, విద్యుత్, ప్రాథమిక ఆరోగ్యం, విద్యారంగాలకు సరిపడా నిధులు కేటాయించాలని నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే ఉచిత పథకాల నుంచి ఎవరైనా లబ్ధి పొందొచ్చు, కానీ ఇతర పన్ను చెల్లింపు దారులపై ప్రతికూల ప్రభావం ఏర్పడకుండా ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. నగదు బదిలీ పథకం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర ఐదు హామీలతో గతేడాది కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్న సంగతిని ఆమె గుర్తుచేశారు. 'కర్ణాటకలో ఏం జరుగుతుందో చూడండి. అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులేవని చెప్పకుండా ఎన్నికల హామీలను తప్పనిసరిగా గౌరవించాలి' అని అన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి, పురుషులపై బస్సు ప్రయాణ చార్జీలు రెట్టింపు చేయడం వల్ల కుటుంబాలపైనే భారం పడుతుందని నిర్మలా సీతారామన్ గుర్తు చేశారు. ఉచిత పథకాలపై నిజాయితీతో కూడిన చర్చ జరుగాలన్నారు. 'ఉచితాలపై మీరు నిజాయితీగా చర్చ పెట్టండి. మీరు ఇచ్చే ఉచిత పథకం ఆమోద యోగ్యం కాదని అంత తేలిక్కాదు. నేను అమలు చేసే సంక్షేమ పథకాన్ని సమర్థించుకోవాలి' అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టుతోపాటు వివిధ విధాన నిర్ణేతలు తరుచుగా ఉచిత పథకాలు, సంక్షేమ పథకాల మధ్య తేడాలు చెప్పడం చాలా కష్టం అని చెబుతున్నారు.

డిక్లరేషన్లను బుట్టదాఖలు చేసిన దోకేబాజ్ బడ్జెట్..

హైదరాబాద్, జులై 25: ఆకాంక్షలను పట్టించుకోని ఆంక్షల పద్దు కాంగ్రెస్ బడ్జెట్ అంటూ విమర్శించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ మేరకు ఆయన ఎక్స్ లో ట్విట్ చేశారు. గ్యారెంటీలను గంగలో కలిపేసిన కోతల.. ఎగవేతల బడ్జెట్ అన్నారు. వాగ్దానాలను గాలికొదిలిన.. వంచనల బడ్జెట్ అని పేర్కొన్నారు. డిక్లరేషన్లను బుట్టదాఖలు చేసిన దోకేబాజ్ బడ్జెట్ అన్నారు. విధానం లేదు, షయం లేదు, విజన్ లేదు, పేర్ల మార్పులతో ఏమార్చిన డొల్ల బడ్జెట్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులకు కత్తిరింపులు అన్నదాతలకు సున్నం అని చురక అంటించారు. ఆడబిడ్డలకు అన్యాయం.. మహాలక్ష్ములకు మహామోసమని ధ్వజమెత్తారు. అవ్వాతాతలకు.. దివ్యాంగులకు.. నిరుపేదలకు నిస్సహాయులకు మొండిచేయి చూపారని ఆరోపించారు. పెన్షన్ల పెంపు మాటెత్తలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దళితులకు దగా.. గిరిజనులకు మోసం.. అంబేద్కర్ అభయహస్తం ఊసులేదు.. శూన్యహస్తమే మిగిలిందన్నారు. బడుగు.. బలహీన వర్గాలకు భరోసాలేదు.. వృత్తి కులాలపై కత్తికట్టారన్నారు. మైనార్టీలకు ఇచ్చిన మాటలన్నీ నీటి మూటలయ్యాయని విమర్శించారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు.. 4 వేల భృతి జాడా పత్తా లేదని పేర్కొన్నారు. విద్యార్థులపై కూడా వివక్ష చూపారని ఆరోపించారు. 5 లక్షల భరోసా కార్డు ముచ్చటే లేదన్నారు.

హైదరాబాద్ అభివృద్ధి పై శ్రద్ధలేదు.. మహానగర మౌలిక వసతులకు నిధులేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేతన్నకు చేయూత లేదు.. ఆటో అన్నలను అండదండ లేదన్నారు. ఆత్మహత్యపాలైన కుటుంబాలకు ఆదుకోవాలన్న మానవీయ కోణమే లేదని విమర్శించారు. మొత్తంగా.. పసలేని.. దిశలేని.. దండగమారి బడ్జెట్ అన్నారు.

రూ.2 లక్షల 91 వేల 159 కోట్లతో తెలంగాణ బడ్జెట్ - భట్టి

హైదరాబాద్, జులై 25: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి.. అసెంబ్లీలో బడ్జెట్ ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు లు ప్రవేశపెట్టారు..

ఈ సందర్భంగా భట్టి అసెంబ్లీలో మాట్లాడుతూ పదేళ్ల అస్తవ్యస్త పాలనకు తెలంగాణ ప్రజలు చరమగీతం పాడారు.. బంగారు తెలంగాణ చేస్తామని ఉత్తరకుమార ప్రగల్భాలు పలికారు.. గత ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది.. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు.. గత పదేళ్లలో ప్రభుత్వ అప్పు పది రెట్లు పెరిగింది.. వామనావతారం లెక్క అప్పులు పెరిగాయి.. ఓ వైపు అప్పులు పెరగగా, మరోవైపు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి అంటూ ధ్వజమెత్తారు.

ఇక రూ.2 లక్షల 91 వేల 159 కోట్లతో తెలంగాణ బడ్జెట్ ను రూపొందించారు.. రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు.. మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా ఉంది.. సాగునీటి పారుదల శాఖకు రూ.26 వేల కోట్లు.. సంక్షేమానికి రూ.40 వేల కోట్లు కేటాయించారు..

సంక్షేమ పథకాలకు ఏకంగా రూ.40 వేల కోట్లు కేటాయించారు..

హార్టికల్చర్‌కు రూ.737 కోట్లు కేటాయింపు..
రోడ్లు, భవనాలకు రూ.5,790 కోట్లు..
హోంశాఖకు రూ.9,564 కోట్లు కేటాయింపు..
పశుసంవర్ధక శాఖకు రూ. 1,980 కోట్లు..
విద్యాశాఖకు రూ. 21,292 కోట్లు..
నీటి పారుదల శాఖకు రూ.22,301 కోట్లు..
ప్రజాపంపిణీకి రూ.3,836 కోట్లు..
గృహజ్యోతికి రూ.2,418 కోట్లు..
పరిశ్రమల శాఖకు రూ.2,762 కోట్లు..
ఐటీ శాఖకు రూ.774 కోట్లు..
500 రూపాయల గ్యాస్ సిలిండర్‌కు రూ.723 కోట్లు..
అడవులు పర్యావరణ శాఖకు రూ.1064 కోట్లు..
ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు..
వైద్య ఆరోగ్య శాఖకు రూ.11,468 కోట్లు..
బీసీ సంక్షేమానికి రూ.9,200 కోట్లు..
మైనార్టీ శాఖకు రూ.3,003 కోట్లు..
స్త్రీ శిశు సంక్షేమ శాఖకు రూ.2,736 కోట్లు..
రీజినల్ రింగ్‌రోడ్‌కు రూ.1525 కోట్లు..
గృహజ్యోతికి రూ.2,418 కోట్లు..
ఎస్సీ సంక్షేమానికి రూ.33,124 కోట్లు..
ఎస్టీ సంక్షేమానికి రూ.17,056 కోట్లు..
జీహెచ్ఎంసీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.3,065 కోట్లు.
రూ.2లక్షల రుణమాఫీ కోసం రూ.31వేల కోట్లు..
లక్ష వరకు రుణం ఉన్న 11.34 లక్షల రైతులకు రుణమాఫీ చేశాం..
రూ.2లక్షల వరకు రుణం ఉన్న రైతులకు త్వరలో రుణమాఫీ..
రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలన్నది మా సంకల్పం..
త్వరలో భూమిలేని రైతు కూలీలకు ఏటా రూ.12 వేల అందిస్తాం..
ప్రధాని ఫసల్ బీమా యోజనలో చేరబోతున్నాం.. మొత్తం వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు..
విద్యుత్ రంగానికి రూ.16,410 కోట్లు.

ఆర్భాటాపు అంకెలు కాదు .. ఆరు గ్యారెంటీల హామీ పత్రం బడ్జెట్

- 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్వీట్

హైదరాబాద్ జూలై 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఆరు గ్యారెంటీల హామీ పత్రం బడ్జెట్ అని, ఆర్భాటాపు అంకెలు కాకుండా వాస్తవపు లెక్కల బడ్జెట్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2024-25కు సంబంధించిన వార్షిక బడ్జెట్ ను ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీనిపై రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ఇది ఆరు గ్యారెంటీల బడ్జెట్ అని స్పష్టం చేశారు.తెలంగాణ ఆకాంక్షలు నెరవేర్చేలా ఈ బడ్జెట్ ను రూపిందించిన భట్టి విక్రమార్క, ఆయన బృందానికి అభినందనలు అంటూ రేవంత్ రెడ్డి తన ట్వీట్ లో పేర్కొన్నారు.

ఇది పూర్తి మోసపు బడ్జెట్టే..కెసిఆర్

-ప్రజల ఆశలపై నీళ్లు చల్లిన భట్టి
-రైతులకు ఈ బడ్జెట్ వెన్నుపోటే
-రుణమాఫీ, రైతు భరోసాలపై ఆంక్షలు వలయం
-ఒక్క కొత్త పథకమైనా ఈ బడ్జెట్ లో ఉందా
-వాస్తవాలకు దూరంగా కాంగ్రెస్ బడ్జెట్
-అంతా ట్రాష్, గ్యాస్..
-ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం
-అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కెసిఆర్ వ్యాఖ్యలు

హైదరాబాద్, జులై 25: ఈ బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందంటూ మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. నేడు జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర రైతులను ఈ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందన్నారు. రైతు భరోసాలో ఆంక్షలు పెట్టపోతున్నట్లు చెప్పి వారి మోసాన్ని బయటపెటారన్నారు. ఒక్క పథకంపై కూడా స్పష్టత లేదని ధ్వజమెత్తారు. యాదవుల అభివృద్ధి కోసం తీసుకువచ్చిన గొర్రెల పెంపకం పథకాన్ని మూసివేసినట్లుగా అర్థం అవుతోందన్నారు. దళితబంధు పథకం ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరమన్నారు. మత్స్యకారులకు కూడా భరోసాలేదన్నారు. ఏ ఒక్క కొత్త సంక్షేమ పథకం కూడా తేలేదన్నారు. మహిళలకు లక్షకోట్లు ఇస్తున్నట్లు అబద్ధాలు చెప్పారన్నారు. రుణాలను కూడా వాళ్లు ఏదో ఇస్తున్నట్లు చెప్పారని ఆరోపించారు.

రైతులకు తాము ఇచ్చిన డబ్బులను ఏదో ఆగం చేశామని దురదృష్టకరమైన వ్యాఖ్యలు చేశారన్నారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం అని ఫైర్ అయ్యారు. రైతులను, వృత్తి కార్మికులను ప్రభుత్వం వంచించిందన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ పాలసీలు ఏంటనే అంశాలపై ప్రకటన లేదన్నారు. చిల్లర మల్లర ప్లాట్ ఫామ్ స్పీచ్ లాగా ఉంది తప్పా.. బడ్జెట్ ప్రసంగంలా లేదన్నారు. ప్రభుత్వం తమ లక్ష్యం, టార్గెట్ ఏంటో చెప్పలేదన్నారు. ఇది పేదల, రైతులతో సహా ఎవరి బడ్జెట్ కాదన్నారు. భవిష్యత్ లో ఈ అంశంపై చీల్చిచెండాడుతామన్నారు.బడ్జెట్ లో రైతు భరోసా ప్రస్తావనే లేదు. రైతులను పొగిడినట్లే పొగిడి వెన్నుపోటు పొడిచారన్నారు. ఈ బడ్జెట్ లో అన్ని వర్గాలకు నిరాశే మిగిల్చిందన్నారు కెసిఆర్.. ఆర్థిక మంత్రి వొత్తి వొత్తి పలకడం తప్ప కొత్తగా ఏమీ లేదన్నారు. ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఇవ్వాలని అనుకున్నామని, అయితే వారు మాత్రం ఆ లోపలే అన్ని అబద్ధాలు చెబుతూ కాలక్షేపం చేయడంతోనే తామ నోరు విప్పాల్సి వచ్చిందన్నారు.. బడ్జెట్ వాస్తవానికి చాలా దూరంగా ఉందంటూ ఇది రైతు శత్రు ప్రభుత్వంగా మారిందన్నారు.

ఆగస్ట్ 9న జంతర్ మంతర్‌లో మాదిగల మహాధర్నా

-ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ

హైదరాబాద్ జూలై 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆగస్టు 9న ఢిల్లో జంతర్ మంతర్‌లో మాదిగల మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఢిల్లో ఢిల్లో మాదిగల మహాధర్నా కర పత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరగక పోవడం వలన మా దిగ, మాదిగ ఉప కులాలుకు విద్యా, ఉద్యోగ, రాజకీయల్లో తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణకు అన్ని పార్టీలు మద్దతు తెలుపుతున్నాయని కానీ పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ మళ్లీ కమిటీల, కమిషన్ పేర్ల మీద కాలయాపన చేస్తున్నారని, మాదిగల ఓట్ల మీద ఉన్న ప్రేమ వర్గీకరణ మీదలేదని మండి పడ్డారు. మాదిగల మహా ధర్నాకు సీపీఎం సీతారం ఏచూరి, సీపీఐ రాజా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. వర్గీకరణకు మద్దతుగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఎంపీ, ఏమ్మెల్యేలు, రాజ్యసభ సభ్యులు పాల్గొనాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగే మహాధర్నాకు ఆగస్టు 1న ఎమ్మార్పీస్ శ్రేణులు ప్రతి నియోజకవర్గంలో ఉన్న ఎమ్మెల్యేలకు, ఎంపీలకు ఆహ్వాన పత్రాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులిజాల గెలువయ్య, మంచాల యాదగిరి, సంగపాక యేసుఖ్, జాతీయ కార్యదర్శి, చిగళ్ల యాదయ్య, ఉపాధ్యక్షులు జీడీ నర్సింహ, పాల్గొన్నారు.

మహారాష్ట్రలో భారి వర్షాలు.. పుణె నగరం జలమయం.నలుగురి మృతి

పుణె జూలై 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మహారాష్ట్రలోని పుణెలో వాన తీవ్రంగా ఉంది.

ఇప్పటి వరకు నలుగురు చనిపోయారు. పాఠశాలలు, కార్యాలయాలను మూసేశారు. చాలా ప్రాంతాలు జలమయం అయిపోయాయి. ఓ ఫైర్ బ్రిగేడ్, రెండు ఎన్డీఆర్ఎఫ్ దళాలను వివిధ ప్రాంతాల్లో మోహరించారు.

మాదాపూర్‌లో రేవ్ పార్టీ.. రియల్టర్లు, విద్యార్థులు అరెస్ట్

హైదరాబాద్, జులై 25: మాదాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన రేవ్ పార్టీని తెలంగాణ టాస్క్‌ఫోర్స్ పోలీసులు భగ్నం చేశారు. ఈ పార్టీవి వచ్చిన 14 మంది యువకులతో పాటు ఆరుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురు పార్టీ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.అయితే, ఈ రేవ్ పార్టీలో ఒక గ్రాము కొకైన్, రెండు గ్రాముల ఎండీఎంఏ, డ్రగ్స్ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.1.25 లక్షల విలువైన మద్యం, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. బేగంపేటకు చెందిన నాగరాజు పుట్టినరోజు సందర్భంగా ఈ రేవ్ పార్టీ నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. ఈవెంట్ ప్రమోటర్ కిషోర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

దేశాన్ని ఏకధాటిపై నిలపడానికి కొత్త తరానికి అవకాశం

-అమెరికా అధ్యక్షుడు జో బైడెన్

వాషింగ్టన్ జూలై 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: దేశాన్ని ఏకతాటిపై నిలపడానికి కొత్త తరానికి అవకాశం కల్పించడానికే తాను అధ్యక్ష రేసు నుంచి తప్పుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. తర్వాత తరానికి బాధ్యతలను అప్పగించడమే మేలైన మార్గమని భావించినట్లు వెల్లడించారు. అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ప్రకటించిన తర్వాత ఆయన తొలిసారి ప్రసంగించారు. ప్రమాదంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కంటే పదవులు ముఖ్యం కాదని చెప్పారు. యువ గళం వినిపించడానికి ఇదే సరైన సమయమని వెల్లడించారు. అమెరికా రాజకీయాల్లో స్పష్టమైన విభజన కనిపిస్తోందని.. దానికి స్వస్తి పలకాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.నియంత, నిరంకుశుల కంటే కూడా దేశం గొప్పదంటూ పరోక్షంగా ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ సమర్థురాలన్నారు. ఆమె అధ్యక్ష అభ్యర్థికి తగిన వ్యక్తి అని పునరుద్ఘాటించారు. డెమొక్రటిక్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిగా హారిస్ తగిన వ్యక్తి అని అన్నారు.అధ్యక్ష కార్యాలయాన్ని గౌరవిస్తానని చెప్పారు. అంతకంటే ఎక్కువగా దేశాన్ని ప్రేమిస్తున్నానని తెలిపారు. అమెరికా ప్రజలకు అధ్యక్షుడిగా పనిచేయడం తన జీవితంలో లభించిన గొప్ప గౌరవమని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి ప్రజలంతా ఏకం కావాలని చెప్పారు. ఈ క్లిష్టమైన పరిస్థితుల్లో పార్టీని ఏకం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అధ్యక్షుడిగా, అమెరికా భవిష్యత్తు కోసం రెండోసారి ప్రెసిడెంట్‌గా పోటీ చేసే సామర్థ్యం తనకు ఉందని నమ్ముతున్నాని చెప్పారు. కానీ ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో ఏది అడ్డురాకూడదని విశ్వాసం వ్యక్తం చేస్తున్నానని వెల్లడించారు.

రికార్డుల నిర్వహణలో జాగ్రత్త.. ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సూచన



అమరావతి, జులై 25:వెన్యూ రికార్డుల నిర్వహణలో భవిష్యత్తులో ఎలాంటి అవకతవకలు జరగకుండా పటిష్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్.పి.సిసోడియా అన్నారు. ఇటీవల సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగిన నేపథ్యంలో ఆయన మదనపల్లెకు వచ్చారు.ఈ సందర్భంగా తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ఆర్డీఓలు, తహసీల్దార్లతో రెవెన్యూ సంబంధిత అంశాలపై ఈరోజు సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిసోడియా మాట్లాడుతూ రెవెన్యూ అధికారులకు తమ పరిధిలోని ప్రతి సబ్జెక్టుపై పూర్తి అవగాహన ఉండాలని అన్నారు.

ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ ఎంతో కీలకమని, రెవెన్యూ రికార్డుల నిర్వహణలో ప్రతి రెవెన్యూ ఉద్యోగి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రానున్న రోజుల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని, రెవెన్యూ అధికారులు ప్రతి చిన్న విషయాన్ని నిశితంగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలన్నారు.ఈ సందర్భంగా గతంలో ఇనాం భూముల రిజిస్ట్రేషన్లు, 22(ఎ) భూ సమస్యలు, 2020-23 సంవత్సరంలో జరిగిన పట్టా భూముల వివరాలు, వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములకు కన్వర్షన్ చేయుట, చుక్కల భూముల సమస్యలు, అసైన్ మెంట్ భూముల వివరాలు తదితర అంశాలపై డివిజన్ల వారీగా ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సమావేశంలో మూడు జిల్లాల కలెక్టర్లు శ్రీధర్ చామకూరి (అన్నమ య్య), సుమిత్ కుమార్ (చిత్తూరు), వెంటేశ్వర్ (తిరుపతి)తో పాటు ఆ జిల్లాల ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

అలుపెరుగని- పోరాట యోధుడు పద్మాచారి

-తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పద్మచారీ జన్మదిన వేడుకలు

హైదరాబాద్ జూలై 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ ఉద్యోగుల సంఘం హనారరీ ఛైర్మన్ ఏ.పద్మాచారి జన్మదిన వేడుకలు తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.అలుపెరుగని-పోరాట యోధుడు పద్మాచారి అని దశాబ్ద కాలంగా తెలంగాణ ఉద్యోగుల సంఘానికి అధ్యక్షులుగా పద్మాచారి ఉద్యోగులకు చేసిన సేవలు మరువలేనివని నేతలు కొనియాడారు.చిరు ఉద్యోగికి ఆపద వచ్చిన ఆపద్బాంధవుడిలా ముందుండి సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాడే యోధుడుగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

రెండు సంవత్సరాల క్రితమే పద్మాచారి పదవీ విరమణ పొందారు. ఉద్యోగులందరూ మరలా పద్మాచారి ని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు . పద్మాచారి61 సంవత్సరాలు పూర్తి చేసుకుని 62 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిన్న రాత్రి మాసబ్ ట్యాంక్ లో ఉన్న పోలీస్ ఆఫీసర్స్ మెస్ లో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో మరం రవీంద్ర కుమార్ తెలంగాణ ఉద్యోగుల సంఘము రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కొత్తలాపూర్ గ్రామం లో జన్మించిన పద్మచారి విద్యార్థి దశ నుండి సామజిక స్పృహ కలిగి ఉన్నారు. ఎక్కడ అన్యాయం అనిపించినా న్యాయం జరిగే వరకు పట్టు పట్టి న్యాయం జరిగే వరకు పోరాటం చేసే తత్త్వం ఉన్నవాడని కొనియాడారు.

నేటి కందం- నేటికీ అందం

ఒడుదుడుకుల కోర్చెడి-చి
త్తడి నేలలోని వృక్ష తతులను గావన్
మడ యడవుల పరిరక్షణ
వడివడిగా చేయవలె ప్రపంచము లోనన్

(జూలై 26 ప్రపంచ మడి అడవుల పరిరక్షణ దినం)

-రాధశ్రీ
సెల్:9494481210

నవ ప్రాధాన్యాలకు మోదం - విభజన హామీల్లో ఖేదం !

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏట ప్రవేశపెట్టే బడ్జెట్ వివరాలను, వరాలను తెలుసు కోవడానికి పౌర సమాజం వేయి కళ్ళతో ఎదురుచూడడం, చాలా సందర్భాల్లో నిరాశ పడడం జరుగుతూనే ఉన్నది. ఏ బడ్జెట్ అయినా అన్ని వర్గాలకు ఆమోదయోగ్య కేటాయింపులు చేయడం ఎన్నిటికీ వీలు కాదు. ప్రభుత్వం ఎంచుకునే ప్రాధాన్యాలను బట్టి పౌర సమాజ విశ్లేషణలు, అభిప్రాయాలు ఆధారపడి ఉంటాయి. బడ్జెట్ ప్రవేశ పెట్టగానే విధిగా ప్రతిపక్షాలు "ఇదో అంకెల గారడి" అని, "పేదల వ్యతిరేక బడ్జెట్" అని మైకుల ముందు పెదవి విరుపులతో విమర్శలు కుమ్మరిస్తారు. అదే క్రమంలో స్వపక్ష నాయకులు "ఈ బడ్జెట్ నిరుపేదల పక్షపాతి"గా ఉందని, "అన్ని రంగాల అభివృద్ధికి ఊతం ఇస్తుందని" సంతోషంగా ఊదరగొడతారు. పార్టీలు, ప్రభుత్వాల్లో అధికార, ప్రతిపక్షాలంటూ ఉండడం సహజం. కాని ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో ప్రజలు మాత్రంగా ఏ పక్షం కాదని తెలుసు కోవాలి. సామాన్యుడి మనసు తృప్తి పడే విధంగా అన్ని రాష్ట్రాలకు దాదాపు సమాన కేటాయింపులు ఉండడం అసాధ్యంగానే తోస్తున్నది. తెలుగింటి కోడలు నిర్మలమ్మ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో స్వపక్ష ఏపీ/బీహారు పల్లెంలో పంచభక్ష్య పరమాన్నాలు వడ్డించి, తెలంగాణ లాంటి విపక్ష ప్రభుత్వ రాష్ట్రాలకు పచ్చడి మెతుకులు కూడా వడ్డించలేదని సర్వత్ర చర్చ జరుగుతున్నది. కేంద్ర ప్రభుత్వం పక్షపాత ధోరిణిని మానేసి అన్ని రాష్ట్రాల ప్రజల శ్రేయస్సుకు ఉపకరించే విధంగా సమానంగా బడ్జెట్ కేటాయింపులు చేయడం జరగాల్సిన స్థానంలో అశ్రిత పక్షపాతంతో వ్యవహరించడం కేంద్ర ప్రభుత్వం పెద్దన్నలకు ఈ మధ్య సర్వసాధారణం అయ్యింది.

నవ ప్రాధాన్యాలతో వికసిత్ భారత్:

స్వాతంత్ర్య భారత శతాబ్ది ఉత్సవాల నాటికి, అనగా 2047 నాటికి ప్రపంచ దేశాల్లో భారత్ సూపర్ పవర్‌లా అగ్ర భాగాన నిలువడానికి ఉపకరించే నవ రత్నాల్లాంటి "నవ ప్రాధాన్యాలను" నిర్ణయించి తదనుగుణంగా నిధులు కేటాయించడం సముచితంగానే ఉన్నది. రానున్న ఐదేళ్ళలో వికసిత్ భారత్ స్వప్నం సాకారం చేయడానికి మోదీ 3.0 ప్రభుత్వం ఎంచుకున్న 9 ప్రాధాన్యాలలో దేశానికి వెన్నెముక అయిన వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేయడం, మధ్య తరగతి వర్గాన్ని పెంచి పోషించడం సముచితంగా ఉన్నది. వ్యవసాయ ఉత్పాదకత, ఉద్యోగ ఉపాధుల పెంపుకు యువతలో నైపుణ్యాల వృద్ధి, సామాజిక న్యాయంతో మానవ వనరుల అభివృద్ధి, తయారీ - సేవా రంగాల ఉన్నతి, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక సదుపాయాల కల్పన, ఆవిష్కరణ - పరిశోధనాభివృద్ధి, భవిష్యత్తు తరం ఉన్నతి అనే 9 ముఖ్య అంశాలను గుర్తించి కేటాయింపులు చేయడం ఆహ్వానించదగిన పరిణామమే. రానున్న ఐదేళ్ళలో ఏడాదికి దాదాపు 80 లక్షల చొప్పున 4 కోట్ల ఉద్యోగాలు కల్పించ తలపెట్టడం యువభారతాని ఆశాజనకంగా ఉన్నది. వేతన జీవులకు కొంత ఊరట, నిరుద్యోగులకు పథకాలు, విద్యార్థులకు రుణాల కల్పన, పట్టణ పేదలకు 3 కోట్ల గృహ నిర్మాణాలు, 2.66 లక్షల కోట్లతో గ్రామాలకు పట్టం కట్టడం, నైపుణ్యాభివృద్ధికి 2 లక్షల కోట్లు కేటాయించడం సబబుగా, సహేతుకంగా ఉన్నది. సెల్‌ఫోన్లు, బంగారం/వెండి, క్యాన్సర్ ఔషధాలు, వైద్య పరికరాలు, తోలు ఉత్పత్తులు, ఉక్కు/జౌళు, మత్స్య పరిశ్రమల ధరలు తగ్గడం కొంత ఊరటను ఇస్తున్నది. పివిసీ ఫ్లెక్సీ బ్యానర్లు, అమోనియం నైట్రేట్, జీవవిచ్ఛిన్నం కాని ప్లాస్టిక్‌ల ధరలు పెంచడం కూడా పర్యావరణ హిత చర్యగా కనిపిస్తున్నది.

స్వపక్షానికి మోదం, విపక్షానికి ఖేదం:

భాజపా నేతృత్వపు ఎన్‌డిఏ స్వపక్ష పార్టీల ప్రభుత్వాలున్న ఆంధ్రప్రదేశ్, బీహార్‌కు అధిక కేటాయింపులు చేయడం మంచిదే కావచ్చు కాని తెలంగాణ, పశ్చిమ బెంగాల్ లాంటి విపక్ష పార్టీల ప్రభుత్వాలు కొలువైన రాష్ట్రాలకు మొండి చేయి చూపడం విమర్శలకు ఊతం ఇస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వాటి నుంచి నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వాలు విపక్షానికి చెందినవనే కారణంగా కేంద్ర ప్రభుత్వ కేటాయింపులు ఈ రాష్ట్రానికి సవతి తల్లి ప్రేమను తలపించే విధంగా పలుచబడడం కొనసాగుతున్నది. కేసిఆర్ కాలంలో ప్రధానమంత్రి, గవర్నర్, కేంద్ర మంత్రులను చులకనగా చూడడంతో మనం బాధ పడ్డాం, మనకు కేటాయింపుల్లో కోతలు కనిపించగా చూసి విచారించాం. నేడు తెలంగాణ సిఎం పలు మార్లు పిఎంను, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర అవసరాలను వివరించి కేటాయింపులు కావాలని కోరారు. నాడు అడగక పోయినా, నేడు అడిగినా తెలంగాణకు మొండి చేయి మాత్రమే కనిపిస్తున్నదన్న ప్రతిపక్షాల విమర్శల్లో వాస్తవం కొంత కనిపిస్తున్నది. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు ఇచ్చిన హామీలు అలాగే అనాధలుగా మిగిలి పోయాయి. ఇప్పటికైనా ఏపికి ఇచ్చిన విభజన హామీలకు నిధులు కేటాయించడం సముచితంగానే ఉన్నప్పటికీ అదే తరహాలో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీల ఊసెత్తక పోవడం విస్మయాన్ని కలిగిస్తున్నది. ప్రజలు అనాదిగా ఎదురు చూస్తున్న గిరిజన యూనివర్సిటీ, ఐఐఎం, రైల్వే కోచ్ పరిశ్రమ, ఉక్కు కర్మాగారం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా లాంటి కనీస విభజన హామీలను దశాబ్ద కాలంగా పాతరేయడం కొనసాగుతున్నది. కమలం ఇస్తున్నది, హస్తం స్వీకరిస్తున్నదనే భావన పోయి, అందరూ సమానమనే ఆలోచనలు మొలవాలి. కేంద్రం నిధులు తెలంగాణ రాష్ట్ర ప్రజల అభ్యున్నతికని ఆలోచించడం మరిచి పోతున్నది. కేంద్ర ప్రభుత్వంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న స్వపక్షాన్ని ఆకర్షించడం, విపక్షాన్ని వికర్షించడం కొనసాగుతున్నది. నేటి ఎన్‌డిఏ ప్రభుత్వం ఏపీ, బీహార్ ఎంపీల మీద ఆధారపడడంతో ఈ రాష్ట్రాలను భాజపా పెద్దన్న పాత్రలో సంకన ఎత్తు కోవడం అనివార్యం అవుతున్నది. నాయుడు, నితీశ్‌లను సంతోష పెట్టడడమే భాజపా ముందున్న ప్రస్తుత కర్తవ్యంగా తోస్తున్నది.

తెలంగాణ నుండి ఎనిమిది మంది భాజపా ఎంపీలు ఎన్నికై, ఇద్దరు కేంద్ర మంత్రులుగా సేవలు అందిస్తున్నప్పటికీ రాష్ట్రానికి కేటాయింపుల్లో కొంత అన్యాయం జరిగినట్లు కనిపిస్తున్నందున ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాలను సవరించుకొని కనీసం విభజన హామీలకు నిధులు కేటాయించాలని మోదీ 3.0 ప్రభుత్వాన్ని సగటు తెలంగాణ ప్రజలు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను సమానంగా చూస్తూ పెద్దన్న పాత్రను పోషిస్తేతేనే దేశం సామాజిక న్యాయంతో కూడిన సమ్మిళిత అభివృద్ధి దిశగా పటిష్ట అడుగులు పడతాయని, దాని ఫలితంగా అసమానతలు తగ్గుతూ సమగ్రాభివృద్ధి జరుగుతుందని తెలుసుకోవలసిన సమయం ఆసన్నమైంది. కమలం, హస్తం, సైకిల్, కారు ప్రధానం కాదని తెలుసుకొంటూ సామాన్యుడి బతుకు బండి సజావుగా సాగడానికి ఇంధనం అందించే దిశగా ప్రభుత్వాలు ప్రజాస్వామ్య విలువకు పట్టం కట్టి సమ న్యాయం చేయాలని ఆశిద్దాం.

- డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

జగన్ కాంట్రాక్టర్‌ను మార్చేశారు.. అందుకే పోలవరం ఆలస్యం- కేంద్రం

-గత ప్రభుత్వం తీరుతోనే జాప్యం
-రూ. 8,044 వేల కోట్లు ఇచ్చాం
-హైదరాబాద్-ఐఐటీ నివేదించింది
-ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి
-మూడేళ్లల్లో పని జరగలేదు
-వచ్చే రెండేళ్లల్లో పూర్తి చేస్తాం
-లోక్‌సభలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ వెల్లడి

న్యూఢిల్లీ, జులై 25 :: పోలవరం నిర్మాణం జాప్యానికి గత ప్రభుత్వమే కారణమనిలోక్ సభలో కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటి వరకూ కేంద్ర వైఖరితోనే పనుల్లో జాప్యం జరిగిందని అప్పటి సీఎం జగన్‌కు రివర్స్ గేర్ లో కేంద్రం షాక్ ఇచ్చింది. కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ లోక్‌సభలో గురువారం స్పష్టం చేశారు. గత ప్రభుత్వ వైఫల్యమే పోలవరం జాప్యానికి కారణమని సీఆర్ పాటిల్ వెల్లడించారు. లోకసభలో టీడీపీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2021లో హైదరాబాద్ ఐఐటీ నివేదికలో ప్రాజెక్టు ఆలస్యానికి కారణాలు పేర్కొన్నట్టు కేంద్ర మంత్రిస్పష్టం చేశారు. కాంట్రాక్టరును మార్చడంతో పాటు భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల్లో జాప్యం జరిగిందన్నారు. ప్రాజెక్టు తొలిదశ పనులు 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని పార్లమెంటుకు జలశక్తి శాఖ చెప్పింది. గత మూడేళ్ళలో రూ. 8,044.31 కోట్లు కేంద్రం నుంచి ఇచ్చినట్లు సీఆర్ పాటిల్ తెలిపారు. మూడేళ్ల పనుల పురోగతి వివరాలను కూడా సమాధానంలో పొందుపరిచారు.

2021..-22 నుంచి మూడేళ్ళలో ప్రాజెక్టు ప్రధాన పనుల్లో 21శాతం మట్టి పనులు, కాంక్రీటు పనులు కేవలం 5.3 శాతం జరిగాయని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కుడి కాలువకు లైనింగ్ పనులు 1.72 శాతం, స్ట్రక్చర్స్ 0.39 శాతం జరిగాయన్నారు. ఎడమ కాలువకు మట్టి పనులు 0.30 శాతం, లైనింగ్ 1.18 శాతం, స్ట్రక్చర్స్ 3.33 శాతం జరిగాయన్నారు. భూసేకరణ 0.22 శాతం, సహాయ పునరావాస కార్యక్రమం 8 శాతం జరిగిందని వివరాలను కేంద్ర మంత్రి వెల్లడించారు. ప్రాజెక్టు పనుల పరిశీలన, ఆలస్యానికి కారణలు తెలుసుకోవడానికి 2021 ఆగస్టు లో పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఐఐటీ హైదరాబాద్ నుంచి సహకారం తీసుకున్నట్లు సీఆర్ పాటిల్ తెలిపారు.

నేపాల్‌లో విమానం ప్రమాదం.. సిబ్బందితోపాటు 19మంది మృతి

ఖాట్మండు జూలై 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);నేపాల్ లో విమాన ప్రమాదం జరిగింది. బుధవారం రాజధాని ఖాట్మండు విమానాశ్రయం నుంచి టేకాఫ్‌కు ప్రయత్నిస్తుండగా విమానం రన్‌వే నుంచి జారిపడి కుప్పకూలింది. దీంతో సిబ్బందితోపాటు విమానంలో ఉన్న 19 మంది ప్రయాణికులు మృతి చెందారు. విమానంలో కొంతమంది సాంకేతిక సిబ్బంది ఉన్నారని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం (ఎం) సమాచార అధికారి జ్ఞానేంద్ర భుల్ హిమాలయన్ వెల్లడించారు.విమానం కుప్పకూలిన తర్వాత మంటలు చెలరేగి దగ్ధమైంది. విమానం నుంచి పొగలు రావడంతో అగ్నిమాపక సిబ్బంది, భద్రతా సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కాగా..దేశీయ శౌర్య విమానయాన సంస్థకు చెందిన ఈ విమానం నేపాలీ రాజధాని నుంచి రిసార్ట్ పట్టణం పోఖారాకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనకు సంబందించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉద్యోగంతో ముడిపెట్టిన ప్రోత్సాహం పథకాన్ని ప్రభుత్వం ప్రకటించింది... ఇది కోట్ల కొద్దీ కొత్త ఉద్యోగాలను సృష్టించనుంది

న్యూఢిల్లీ, జులై 25 :కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు లోక్ సభ లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2024-25 ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసించారు.

కేంద్ర బడ్జెట్ 2024-25 ను గురించి ప్రధాన మంత్రి వ్యాఖ్యానిస్తూ, దేశాన్ని అభివృద్ధి పరంగా కొత్త శిఖరాలకు ఖాయంగా తీసుకుపోయే ఈ సంవత్సరపు బడ్జెటు విషయంలో పౌరులందరికీ అభినందనలను తెలియజేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ తో పాటు మంత్రి బృందం సభ్యులందరూ అభినందనీయులే అని ఆయన అన్నారు.

"కేంద్ర బడ్జెట్ 2024-25 సమాజంలో ప్రతి ఒక్క వర్గానికి సాధికారితను కల్పిస్తుంది" అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ బడ్జెటు పల్లె ప్రాంతాల పేద రైతులను సమృద్ధి బాటలోకి తీసుకు పోతుందని ఆయన అన్నారు. 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకు వచ్చిన తరువాత, ఇటీవలే నవ్య మధ్యతరగతి ఉనికిలోకి వచ్చిందని ప్రధాన మంత్రి వివరిస్తూ, వారికి సాధికారితను కల్పించడాన్ని ఈ బడ్జెటు కొనసాగిస్తూనే లెక్కలేనన్ని ఉద్యోగ అవకాశాలను సమకూర్చుతుందన్నారు. "ఈ బడ్జెట్ విద్యకు, నైపుణ్యాభివృద్ధికి ఒక కొత్త విస్తృతిని ప్రసాదిస్తుంది" అని ఆయన అన్నారు. బడ్జెట్ లోని కొత్త పథకాలు మధ్యతరగతి, ఆదివాసీ సముదాయం, దళితులు మరియు వెనుకబడిన వర్గాల ప్రజల జీవితాలను పరిపుష్టం చేయాలన్న లక్ష్యాన్ని కలిగివున్నాయని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ సంవత్సరం బడ్జెటు చిన్న వ్యాపారాలకు, సూక్ష్మ, లఘు, మధ్యతరహా, వాణిజ్య వ్యవస్థ (ఎమ్ఎస్ఎమ్ఇ) లకు ఒక కొత్త బాటను వేస్తూ, అదే కాలంలో ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యానికి కూడా పూచీ పడుతుందని ఆయన నొక్కి చెప్పారు. "తయారీతో పాటు, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర బడ్జెట్ ప్రోత్సాహాన్ని ఇస్తుంది" అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ఆర్థిక వృద్ధిని ఈ బడ్జెటు కొనసాగిస్తూనే ఆర్థిక వృద్ధికి ఒక కొత్త బలాన్ని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగ కల్పనకు, స్వయంఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. ఉత్పాదకత తో ముడిపెట్టిన ప్రోత్సాహకం (పిఎల్ఐ) పథకం సాఫల్యాన్ని గురించి ప్రధాన మంత్రి చెప్తూ, ఉద్యోగ కల్పనతో ముడిపెట్టిన ప్రోత్సాహక పథకం కోట్లాది ఉద్యోగాలను సృష్టిస్తుందంటూ ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ పథకంలో భాగంగా ఒక యువతికి లేదా యువకునికి వారి తొలి నౌకరీలో మొదటి జీతాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని వివరించారు. ఉన్నత విద్యకు, ఒక కోటి మంది యువతీయువకులకు ఇంటర్న్ షిప్ కు ఉద్దేశించిన పథకాన్ని గురించి కూడా ఆయన ప్రస్తావించారు. "ఈ పథకంలో భాగంగా అగ్రగామి వ్యాపార సంస్థలలో పనిచేస్తూ, యువ ఇంటర్న్ లు అనేక కొత్త అవకాశాలను కనుగొనగలుగుతారు" అని ప్రధాన మంత్రి అన్నారు.

ప్రతి పట్టణంలో, ప్రతి గ్రామంలో, ప్రతి కుటుంబంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేయాలన్న నిబద్ధతను గురించి ప్రధాన మంత్రి వివరిస్తూ, 'ముద్ర పథకం'లో భాగంగా పూచీకత్తు అక్కరలేని రుణాల పరిమితిని 10 లక్షల రూపాయల నుంచి పెంచి 20 లక్షలకు పెంచడాన్ని ప్రస్తావించారు. ఇది చిన్న వ్యాపారస్తులకు, మహిళలకు, దళితులకు, వెనుకబడిన వర్గాలవారికి మరియు నిరాదరణకు లోనైనవారికి ఎంతో ప్రయోజనకారి అవుతుందన్నారు.

భారతదేశాన్ని ప్రపంచంలో తయారీ కేంద్రం (గ్లోబల్ మేన్యుఫేక్చరింగ్ హబ్) గా తీర్చిదిద్దాలన్న నిబద్ధతను ప్రధాన మంత్రి నొక్కి చెప్తూ, దేశంలో మధ్యతరగతితో ఎమ్ఎస్ఎమ్ఇ కి ఉన్న బంధాన్ని, పేద ప్రజలకు ఉద్యోగ కల్పనలో ఎమ్ఎస్ఎమ్ఇ కి ఉన్న సత్తాను వివరించారు. చిన్న పరిశ్రమలకు పెద్ద శక్తి లభించేటట్లు బడ్జెటులో ఒక కొత్త పథకాన్ని ప్రకటించడమైందని, ఆ పథకం ఎమ్ఎస్ఎమ్ఇ లకు పరపతి పరమైన సౌలభ్యాన్ని పెంచుతుందని ప్రధాన మంత్రి తెలిపారు. "బడ్జెట్ లో చేసిన ప్రకటనలు తయారీని, ఎగుమతులను ప్రతి జిల్లా ముంగిటకు తీసుకుపోతాయి'' అని ఆయన అన్నారు. "ఇ-కామర్స్, ఎగుమతి కేంద్రాలు (ఎక్స్‌పోర్ట్ హబ్స్), ఆహార నాణ్యత పరీక్ష ప్రక్రియ.. ఇవి 'ఒక జిల్లా, ఒక ఉత్పత్తి' కార్యక్రమానికి కొత్త జోరును అందిస్తాయి" అని ఆయన అన్నారు.

కేంద్ర బడ్జెట్ 2024-25 భారతదేశంలో అంకుర సంస్థ (స్టార్ట్-అప్) లకు, నూతన ఆవిష్కరణల వ్యవస్థకు అసంఖ్యాక అవకాశాలను మోసుకు వస్తుందని ప్రధాన మంత్రి అభివర్ణించారు. అంతరిక్ష ప్రధాన ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తిని సంతరించడానికి, ఒక వేయి కోట్ల రూపాయల కార్పస్ ఫండ్, ఏంజెల్ ట్యాక్స్ రద్దు లను ఆయన ఉదాహరించారు.

"ఇదివరకు ఎన్నడూ ఎరుగనంత అధిక స్థాయిలో మూలధన వ్యయం (కేపెక్స్) ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తి లా మారనుంది" అని ప్రధాన మంత్రి అన్నారు. 12 కొత్త పారిశ్రామిక కేంద్రాలు (ఇండస్ట్రియల్ నోడ్స్), కొత్త శాటిలైట్ టౌన్స్, 14 ప్రధాన నగరాలలో రవాణా సంబంధ ప్రణాళికలను ఆయన ప్రస్తావించారు. ఈ చర్యలు దేశంలో కొత్త ఆర్థిక కేంద్రాల (ఇకానామిక్ హబ్స్) అభివృద్ధికి దారితీసి, లెక్కలేనన్ని ఉద్యోగాలను సృష్టించనున్నాయని ఆయన అన్నారు.

రక్షణ సంబంధ ఎగుమతులు రికార్డు స్థాయికి చేరుకొన్న సంగతిని ప్రధాన మంత్రి ప్రముఖంగా ప్రస్తావిస్తూ, రక్షణ రంగాన్ని స్వయంసమృద్ధంగా తీర్చిదిద్దడానికి ఉద్దేశించిన అనేక అంశాలను ఈ సంవత్సరపు బడ్జెటులో చేర్చడమైందన్నారు. భారత్ పట్ల ప్రపంచంలో ఆకర్షణ నిలకడగా పెరుగుతోంది, ఇది పర్యాటక పరిశ్రమలో కొత్త అవకాశాలను సృష్టిస్తోంది అని ఆయన అన్నారు. ఈ సంవత్సరం బడ్జెట్ లో పర్యాటక రంగానికి ప్రాధాన్యాన్ని ఇచ్చినట్లు ఆయన తెలియజేస్తూ పర్యాటక పరిశ్రమ పేదలకు, మధ్యతరగతికి, ఎన్నో అవకాశాలను అందించనుం దన్నారు.

గత పదేళ్ళలో పేదలకు, మధ్యతరగతికి పన్నుల సంబంధ ఉపశమనం లభించేటట్లు ప్రభుత్వం శ్రద్ధ వహించగా, ఈ సంవత్సరం బడ్జెటులో ఆదాయపు పన్నును తగ్గించేందుకు స్టాండర్డ్ డిడక్షన్ ను పెంచేందుకు, టిడిఎస్ నియమాలను సరళతరం చేసేందుకు సంబంధించిన నిర్ణయాలను తీసుకోవడమైందని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ఈ సంస్కరణలు పన్ను చెల్లింపుదారులకు మరింత డబ్బును ఆదా చేసుకొనే అవకాశాన్ని ఇస్తాయని ఆయన అన్నారు.

'పూర్వోదయ' దృష్టికోణంతో భారతదేశంలో తూర్పు ప్రాంతాలలో అభివృద్ధి ప్రక్రియ సరికొత్త జోరును, సరికొత్త శక్తిని పుంజుకోనుందని ప్రధాన మంత్రి తెలిపారు. "భారత దేశంలో తూర్పు ప్రాంతాలలో రహదారులు, జల పథకాలు, విద్యుత్తు పథకాల వంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి కొత్త ఉత్తేజాన్ని అందించడం జరుగుతుందని ఆయన అన్నారు.

"దేశ రైతులపై ఈ బడ్జెట్ ప్రధానంగా దృష్టిని సారించింది" అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ధాన్య నిలవ పథకాన్ని అమలు చేసిన తరువాత, ఇక కాయగూరల ఉత్పత్తి క్లస్టర్ లను ప్రవేశపెట్టడం జరుగుతుంది; తత్ఫలితంగా ఇటు రైతులకు, అటు మధ్యతరగతికి మేలు చేకూరుతుంది అని ఆయన అన్నారు. "వ్యవసాయ రంగంలో స్వయం సమృద్ధంగా నిలవడం భారతదేశ తక్షణావసరం, అందుకని పప్పు ధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తిని పెంచడంలో రైతులకు సాయపడడానికి కూడా తగిన చర్యలను ప్రకటించడమైంది" అని ఆయన స్పష్టం చేశారు.

పేదరిక నిర్మూలన, పేద ప్రజలకు సాధికారిత కల్పనలకు సంబంధించిన ప్రధాన పథకాలను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, పేదల కోసం దాదాపుగా మూడు కోట్ల ఇళ్లను గురించి, 'జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్' ను గురించి తెలియజేశారు. 5 కోట్ల ఆదివాసి కుటుంబాలకు కనీస సౌకర్యాలను జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ నమకూర్చుతుందన్నారు.

గోల్డ్, సిల్వర్‌పై కస్టమ్ డ్యూటీ 10% నుంచి 6 శాతానికితగ్గింపు

- ఏకంగా తగ్గిన బంగారం ధర

హైదరాబాద్ జూలై 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బంగారం, వెండి కొనాలనుకునే వారి బడ్జెట్‌లో తీపి కబురు విని పించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్‌లో బం గారం, వెండిపై కస్టమ్ డ్యూటీని 4 శాతం తగ్గించారు. అంటే బంగారం, వెండిపై ప్రస్తుతం ఉన్న ప్రాథమిక కస్టమ్ డ్యూటీని 10 శాతం నుంచి 6 శాతానికి తగ్గించారు. అలాగే ప్లాటినంపై కస్టమ్ డ్యూటీ ని 6.4 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించారు. బడ్జెట్ ప్రకటన తర్వాత బం గారం ధర రూ.4000 తగ్గింది. వెండి ధర రూ. 3,000 పైగా తగ్గింది. ప్ర కటన తర్వాత ఎంసిఎక్స్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.2036 తగ్గి రూ.70,682కి చేరుకుంది. అదే సమయంలో కిలో వెండి ఈ కాలంలో రూ. 3,000 తగ్గి రూ. 86,000 స్థాయికి చేరుకుంది.

హైదరాబాద్‌లో రూ.4వేలు తగ్గిన బంగారం ధర

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో 10 గ్రాముల బంగారం (24 క్యారెట్) ధర రూ.4వేలు తగ్గి రూ.70,860కి పడిపోయింది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా 24 క్యారెట్ల బంగారం ధర రూ.4వేలు తగ్గి రూ.71,010కు చేరుకుం ది. అయితే శనివారం బులియన్ మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర రూ. 75,550 వద్ద ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బలపడుతున్న ట్రెండ్, స్థానిక నగల వ్యాపారుల నుంచి డిమాండ్ కారణంగా గత వారం బంగారం ధరలు పెరిగాయి. జూలై 18 నుంచి గత నాలుగు సెషన్లలో వెండి కిలోకు రూ.3,400 తగ్గింది. జూలై 18న కిలో రూ.400 తగ్గి రూ.94,000 వద్ద ముగి సింది. గ్లోబల్ మార్కెట్లో స్పాట్ బంగారం మరోసారి ఔన్స్ 2400 డాలర్లకి చేరుకుంది. స్పాట్ బంగారం ఔన్స్‌కి 2,394 డాలర్ల వద్ద ఉంది. అమెరికా గోల్డ్ ఫ్యూచర్స్ ఒక ఔన్స్ 2,395 డాలర్ల వద్ద ఉన్నాయి.

కేంద్ర బడ్జెట్ లో రూ.2 లక్షల కోట్ల విలువైన ప్రధాని ప్యాకేజీని ప్రకటన.

ఐదేళ్ల కాలంలో 4.1 కోట్ల మంది యువతకు ఉపాధి, నైపుణ్యం, ఇతర అవకాశాలు

న్యూఢిల్లీ, జులై 25 :బడ్జెట్ 2024-25 లో ప్రధానంగా ఉపాధి, నైపుణ్యం, ఎంఎస్ఎంఈలు, మధ్యతరగతిపై దృష్టి సారించినట్లు కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంట్ లో 2024-25 కేంద్ర బడ్జెట్ ను ప్రవేశపెడుతూ వెల్లడించారు.

కొత్తగా ఎన్నికైన కేంద్ర ప్రభుత్వ తొలి పూర్తి సంవత్సర బడ్జెట్ ను కేంద్ర ఆర్థికమంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లో ప్రవేశపెట్టారు. బడ్జెట్ లో ఐదు పథకాలు, కార్యక్రమాలతో కూడిన 'ప్రధాన మంత్రి ప్యాకేజీ' ని ఆర్థిక మంత్రి ప్రకటించారు. 4.1 కోట్ల మంది యువతకు రానున్న ఐదేళ్ల కాలంలో ఉపాధి, నైపుణ్యం, ఇతర అవకాశాలను కల్పించడం కోసం రూ.2 లక్షల కోట్ల కేంద్ర వ్యయంతో ప్యాకేజీని ప్రకటించారు. ఈ ఏడాది విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కోసం రూ.1.48 లక్షల కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

ప్రధాన మంత్రి ప్యాకేజీలో భాగంగా 'ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల' కోసం ప్రభుత్వం ఈ క్రింది మూడు పథకాలను అమలు చేస్తుందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇవి ఈపీఎఫ్ఓలో నమోదైన ఆధారంగాఉంటాయని, మొదటిసారి ఉద్యోగార్థులను గుర్తించడం, ఉద్యోగులు, ఉద్యోగ కల్పన చేసే యజమానులకు ప్రోత్సాహంపై దృష్టి సారించినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు.

రెండేళ్లలో 2.1 కోట్ల మంది యువతకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఈ పథకాన్ని రూపొందించారు. కొత్తగా వివిధ రంగాల్లోకి ఉద్యోగులుగా చేరే వారందరికీ ఒక నెల వేతనం లభిస్తుంది. అర్హత వేతన పరిమితి నెలకు రూ.లక్ష ఉంటుంది. ఈపీఎఫ్ఓలో నమోదైన విధంగా మొదటిసారి పనిచేసే ఉద్యోగులకు ఒక నెల వేతనాన్ని 3 వాయిదాల్లో రూ.15,000 వరకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ రూపంలో అందించనున్నారు. మొదటిసారి ఉద్యోగార్థుల విషయంలో ఉద్యోగులకు అదేవిధంగా యజమానులకు ఈ రాయితీ చాలా ముఖ్యమైనది. వారు పూర్తి స్థాయి ఉద్యోగ బాధ్యతలు చేపట్టే నాటికి అన్ని నేర్చుకుని ఉత్పాదకంగా మారేందుకు ఇది తోడ్పాటును అందిస్తుంది. రెండో విడత క్లెయిమ్ పొందేందుకు ఉద్యోగి తప్పనిసరిగా ఆన్ లైన్ ఆర్థిక అక్షరాస్యత కోర్సును పూర్తి చేయాలి. నియామకం జరిగిన ఏడాదిలోగా మొదటి ఉద్యోగార్థులకు ఉద్యోగం మానేస్తే రాయితీని యాజమాన్యం తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

తయారీ రంగంలో తొలిసారి ఉద్యోగులను గణనీయంగా నియమించుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ పథకం ఈ రంగంలో అదనపు ఉపాధిని ప్రోత్సహిస్తుందని, తద్వారా ఉపాధిలోకి ప్రవేశించే 30 లక్షల మంది యువతకు, వారి యజమానులకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. ఉద్యోగంలో చేరిన మొదటి నాలుగేళ్లలో ఈపీఎఫ్ఓ చందాకు సంబంధించి ఉద్యోగికి, యజమానికి నేరుగా నిర్ణీత స్థాయిలో ప్రోత్సాహకాన్ని అందిస్తారు. నియామకం జరిగిన ఏడాదిలోగా మొదటి ఉద్యోగార్థులకు ఉద్యోగం మానేస్తే రాయితీని యాజమాన్యం తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

యజమాని-కేంద్రీకృత పథకం ద్వారా అన్ని రంగాల్లో అదనపు ఉపాధి లభిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి తెలిపారు. నెలకు రూ.లక్ష వేతనం లోపు ఉన్న అదనపు ఉద్యోగాలన్నింటినీ లెక్కిస్తారు. ప్రతి అదనపు ఉద్యోగికి ఈపీఎఫ్ఓ చందా (కంట్రిబ్యూషన్) కింద నెలకు రూ.3,000 చొప్పున రెండేళ్ల పాటు యజమానులకు ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది. ఈ పథకం ద్వారా అదనంగా 50 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ప్రధాన మంత్రి ప్యాకేజీ కింద బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్న 4వ పథకం రాష్ట్ర ప్రభుత్వాలు మరియు పరిశ్రమల సహకారంతో నైపుణ్యాన్ని పెంపొందించడానికి రూపొందించిన ఒక కొత్త కేంద్ర ప్రాయోజిత పథకం. మొత్తం రూ.60,000 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పథకంలో ఐదేళ్ల కాలంలో 20 లక్షల మంది యువతకు నైపుణ్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్యసాధనకు హబ్ లో 1,000 పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్-ఐటీఐ)లను ఆధునీకరించి, ఫలితాల ఆధారిత విధానంతో తగిన ఏర్పాట్లలో నవీకరిస్తామని చెప్పారు. పరిశ్రమ నైపుణ్య అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల విషయాలు, డిజైన్ ను రూపొందిస్తామని, కొత్తగా అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెడతామని ఆర్థిక మంత్రి తెలిపారు.

ప్రధాన మంత్రి ప్యాకేజీ కింద 5వ పథకం గురించి కేంద్రమంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. "ప్రభుత్వం ఐదేళ్లలో కోటి మంది యువతకు 500 అగ్రశ్రేణి సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడానికి ఒక సమగ్ర పథకాన్ని ప్రారంభిస్తుంది (కంపెనీల భాగస్వామ్యం స్వచ్ఛందం). దీని వల్ల 12 నెలల పాటు నిజజీవిత వ్యాపార



నీటి విడుదలపై సాగునీటి సలహా మండలి సమావేశం ఏర్పాటు చేయాలి..

-పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుండి రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయాలి
-ఉమ్మడి జిల్లాలోని చెరువులను నింపేలా కార్యాచరణ చేపట్టాలి
-ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన రాయలసీమ సాగునీటి సాధన సమితి

కర్నూలు, జులై 25 :భారీ వరద శ్రీశైలం రిజర్వాయర్ కు వస్తుండటంతో రిజర్వాయర్ నీటిమట్టం 854 అడుగులు చేరడంతో పోతిరెడ్డి పాడు హెడ్‌రెగ్యులేటర్ నుండి నీటిని విడుదల చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురు వారం సమితి కార్యాలయంలో మాట్లాడుతూ తుంగభద్ర, కృష్ణా నదుల ద్వారా శ్రీశైలం ప్రాజెక్టుకు వరద భారీగా వస్తుండడంతో రాయలసీమ రైతాంగం ఆనందంగా వున్నారన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుండి రాయలసీమలోని రిజర్వాయర్లకు నీటిని విడుదల చేసేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని చెరువులకు నీటి విడుదల ఎలాంటి జాప్యం లేకుండా చెరువులు నింపేలాగా కార్యాచరణ చేపట్టాలని బొజ్జా కోరారు. ఉమ్మడి కర్నూలు జిల్లా, కడప జిల్లాలకు సంబంధించిన కేసీ కెనాల్, ఎస్ఆర్ బీసీ, తెలుగు గంగ, హంద్రీ నీవా ప్రాజెక్టుల సాగునీటి విడుదలపై సాగునీటి సలహా మండలి సమావేశం ఏర్పాటు చేసి సాగునీటి విడుదల షెడ్యూల్ ప్రకటించాలని బొజ్జా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, సౌదాగర్ ఖాసీం మియా, భాస్కర్ రెడ్డి, పట్నం రాముడు, రాఘవేంద్ర గౌడ్, మహమ్మద్ పర్వేజ్, మనోజ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులపై బీఆర్ఎస్ ముసలి కన్నీళ్లు

- మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్

హైదరాబాద్ జూలై 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఆర్టీసీ కార్మికులపై బీఆర్ఎస్ మునలి కన్నీళ్లు కారుస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైరయ్యారు. ఆర్టీసీపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. గత పదేళ్లలో ఆర్టీసీ సంస్థను చంపే ప్రయత్నం చేశారని నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ.. "ఆర్టీసీ కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చింది.. ఆర్టీసీ కార్మికులను పీఆర్సీ పరిధిలోకి తెస్తామన్నారు. ఆర్టీసీ విలీనంపై ఎప్పటిలోగా అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటిస్తారు. కార్మికుల యూనియన్ల పునరుద్ధరణ ఎప్పుడు చేస్తారు? అని ప్రశ్నించారు.హరీశ్ రావు ప్రశ్నకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం ఇస్తూ.. బీఆర్ఎస్ పై నిప్పులు చెరిగారు. యూనియన్లు రద్దు చేసి ఇప్పుడు పునరుద్ధరణ గురించి హరీశ్ రావు మాట్లాడుతున్నారని విమర్శిం చారు. ఆర్టీసీ కార్మికులు 50 రోజులు సమ్మె చేసినా గతంలో పట్టించు కోలేదని.. ఆర్టీసీ సొమ్మును గత ప్రభుత్వం వాడుకుందని చెప్పారు. ఆర్టీసీకి తాము రూ.300 కోట్లు ఇస్తున్నామని తెలిపారు. ఆర్టీసీకి కొత్త బస్సులు కొంటున్నామని.. ఆర్టీసీలో 3,035 మంది ఉద్యోగులను నియమిస్తున్నామని మంత్రి పొన్నం చెప్పారు.

జగన్ పాలనలో శాంతి భద్రతలు విధ్వంసం..ప్రజాస్వామ్యం అపహాస్యం- చంద్రబాబు

-గత ప్రభుత్వంలో ఎవ్వరినీ వదల్లేదు
-జీవో నెంబర్ వన్ తో సంకెళ్లు వేశారు
-నాపై 17 కేసులు పెట్టారు
-జేసీ ప్రభాకర రెడ్డిపై 60 కేసులు
-రఘురామపై చిత్రహింసలు
-ఆ వీడియోలు చూసి అప్పటి సీఎం నవ్వుకున్నారు
-ఇక తప్పుడు రాజకీయాలు సహించం
-శాంతిభద్రతలపై బాబు శ్వేతపత్రం విడుదల

అమరావతి, జులై 25:తప్పుడు రాజకీయాలను సహించమని ఏపీ సీఎం చంద్రబాబు వైసీపీ నేతలకు వార్నింగ్ ఇచ్చారు. శాంతిభద్రతలపై అసెంబ్లీలో ఆయన శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, టీడీపీ, జనసేన కార్యాలయాలపై దాడులు చేశారని, జై జగన్ అనలేదని తోట చంద్రయ్యను దారుణంగా చంపారని, ఇప్పుడు శాంతిభద్రతలు విఫలమయ్యాయని వైసీపీ నాయకులు ఢిల్లీలో నిరసన తెలుపుతున్నారని చంద్రబాబు స్పష్టం చేశారు. లా అండ్ ఆర్డర్ ను సక్రమంగా నిర్వహించడం ఎన్డీయే ప్రభుత్వం బాధ్యతని, తప్పుడు రాజకీయాలు చేస్తే సహించమన్నారు.

ప్రతిపక్షాలను నియంత్రించేందుకే ఆ జీవో..

ప్రతిపక్ష పార్టీల కార్యకలాపాలను నియంత్రించడానికే జీవో 1 తీసుకొచ్చారని, పులివెందులలో పోటీ చేసిన రవీంద్రనాథ్‌పై కేసుపెట్టి జైలులో పెటారని, సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయంటూ ధూళిపాళ్లను జైలులో పెట్టారని, ప్రభుత్వాధికారులపై దాడి చేశారని కూన రవికుమార్‌పై కేసులు పెట్టారని చంద్రబాబు వివరించారు. ఇక మహిళా నేతలపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టారని, పర్నీచర్ దుర్వినియోగం చేశారని కోడెల శివప్రసాదరావుపై 18 కేసులు పెట్టారని, ఈ అవమాన ంతో బతకలేనని కోడెల ఆత్మహత్యకు పాల్పడ్డారనిఆవేదన వ్యక్తం చేశారు. నాటి సీఎం ఇంట్లో ఇప్పుడు కూడా ప్రభుత్వ ఫర్నీచర్ ఉందని సీఎం చంద్రబాబు ఆరోపించారు.

అప్పట్లో ఎవ్వరినీ వదల్లేదు

వంగలపూడి అనితపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారని, అయ్యన్నపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అత్యాచార యత్నం కేసులు పెట్టారని సీఎం చంద్రబాబు వివరించారు. ఇక అచ్చెన్నాయుడుపై కక్ష తీర్చుకున్నారని, ఆరోగ్యం సరిగా లేకపోయినా 600 కి.మీ వాహనంలో తిప్పారని, సంబంధం లేకపోయినా ప్రశ్నాపత్రం లీకైందని నారాయణపై కేసుపెట్టారని , ఇక ఎదురించినందుకు రఘురామను లాకప్‌లో చిత్రహింసలు పెట్టారని, ఈ వీడియో చూసి నాటి సీఎం పైశాచిక ఆనందం పొందారని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయిదేళ్లు సొంత నియోజ కవర్గానికి ఎంపీ రఘురామ వెళ్లకుండా చేశారని, ఎంపీ రఘురామకు సొంత నియోజకవర్గంలో కూడా భద్రత లేని పరిస్థితిని కల్పించారని సీఎం చంద్ర బాబు అన్నారు. గత పాలనలో మాన సికం గా, శారీరకంగా మనోవేదన పడ్డారని, పోలీసుల అండతో ప్రజా స్వామ్య పునాదులపై దాడులు చేశారని, చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూడు రాజధానుల బిల్లుపై దురుసుతనం..

శాసన మండలిలో 3 రాజధానుల బిల్లు విషయంలో దుర్మార్గంగా ప్రవర్తించారని, మండలి ఛైర్మన్ పనిచేయకుండా చేసి గొడవపడ్డారని, గత పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమైందన్నారు. ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు పోలీసులు ఆయుధంగా మారారని పోలీసులు వైఎస్సార్సీపీ నేతలతో కుమ్మక్కై నిబంధనలు ఉల్లంఘించారని, వైసీపీ నేతలతో విభేదిస్తే పోస్టింగ్‌లు నిలిపి, . వీఆర్‌లో ఉంచారని , అయిదేళ్లపాటు వీఆర్ లోనే అధికారు లుఉన్నారని, పోలీసు వ్యవస్థను పూర్తిగా విధ్వంసం చేశారని సీఎం స్పష్టం చేశారు. బాబ్లీ కేసు తప్ప నాపై గతంలో ఎప్పుడూ కేసులు లేవు, వైసీపీ అధికారంలోకి వచ్చాక నాపై 17 కేసులు పెట్టారు, పవన్ కల్యాణ్‌పై ఏడు కేసులు పెట్టారు, ప్రతిపక్ష నేతలను అణచివేసేందుకు యత్నించారు, జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఎక్కువగా 60కి పైగా కేసులు పెట్టారు, పల్లా శ్రీనివాసరా వుఇంటిని కూల్చివేశారు, అదే పల్లా శ్రీనివాసరావుకు రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ వచ్చిందని సీఎం చంద్రబాబు అన్నారు.

అయిదు అంశాల శ్వేత పత్రం

మొత్తం అయిదు అంశాలుగా శ్వేతపత్రాన్ని విభజించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు శాంతి భద్రతలను చాలా చక్కగా మెయింటెయిన్ చేశారన్నారు.గతంలో రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని కంట్రోల్ చేశామని చెప్పారు. సీమలో ఫ్యాక్షనిజం లేకుండా చేయాలని చూశామని.. ఆ క్రమంలో చివరకు తమ పార్టీ సీనియర్ ఎమ్మెల్యేలు ఇద్దరిని అరెస్ట్ చేసిన తర్వాత మిగిలిన వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. తద్వారా రాయలసీమలో ఫ్యాక్షనిజం లేకుండా చేశామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. హైదరాబాద్‌లో మత ఘర్షణలను ఉక్కుపాదంతో అణిచి వేశామన్నారు. దీంతో మత సామరస్యానికి వేదికగా హైదరాబాద్‌ను నిలిపామని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు.. వామపక్ష తీవ్రవాదాన్ని సైతం గ్రేహౌండ్స్ ద్వారా అదుపులోకి తీసుకు వచ్చే ప్రయత్నం చేశామన్నారు. ఇక రాష్ట్రంలో ఎక్కడైనా రౌడీయిజం కనిపిస్తే.. దానిని సైతం ఉక్కుపాదంతో అణిచి వేశామని తెలిపారు. తమ ప్రభుత్వం చర్యల వల్ల ప్రజల్లో భద్రత పెరిగి ప్రతి ఒక్కరిలో ఓ నమ్మకం అయితే వచ్చిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని శాంతి భద్రతలను కాపాడామని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా సోదాహరణగా వివరించారు.

ఇది నిజంగా గాడిద గుడ్డు బడ్జెట్టే - బండి సంజయ్

హైదరాబాద్, జులై 25: గాడిద గుడ్డు పెట్టడం ఎంత నిజమో.. కాంగ్రెస్ హామీల అమలు కూడా అంతే నిజమని కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. నేడు ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఆర్థిక మంత్రి చదివింది బడ్జెట్టా అప్పుల పత్రమా.. అన్నది అర్థం కావడం లేదన్నారు.

ఆదాయం ఎలా సమకూర్చుకుంటారో బడ్జెట్‌లో చూపలేదని విమర్శించారు. ప్రభుత్వ భూములన్నింటినీ అమ్మాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ బడ్జెట్‌ను చూస్తుంటే హామీల అమలు రాష్ట్ర ప్రభుత్వానికి చేతకాదని తెలుస్తోందన్నారు.

'కాంగ్రెస్ + రాష్ట్ర బడ్జెట్ = గాడిద గుడ్డేనా?. గాడిద గుడ్డు పెట్టం ఎంత నిజమో.. కాంగ్రెస్ హామీల అమలు అంతే నిజమనడానికి ఈ బడ్జెట్ నిదర్శనం. ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో నిధులెందుకు కేటాయించలేదు. ఆరు గ్యారంటీలు సహా హామీల అమలుపై చర్చ జరగకుండా కేంద్రాన్ని బద్నాం చేయాలనుకుంటున్నారా.. కేటాయింపులకు సరిపడా ఆదాయం ఎక్కడి నుంచి నిధులు సమకూరుస్తారో బడ్జెట్ లో చూపకపోవడం విడ్డూరం. రూ. లక్షన్నర కోట్లతో నిర్మిస్తామన్న మూసీ రివర్ ఫ్రంట్ కు బడ్జెట్ లో పైసా కేటాయించని కాంగ్రెస్ నేతలా కేంద్రంపై విమర్శలు చేసేది? హామీలు అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ కు మాటలు ఎక్కువని బడ్జెట్ చూస్తే అర్థమవుతోంది.

రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య చిచ్చు పెడతారా.. అంటూ ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రశ్న ఇచ్చి.. పారిపోతారా.. జగన్ ను అసెంబ్లీలో దులిపేసిన హోం మంత్రి

అమరావతి, జులై 25:వైసీపీ నేతలపై దాడులు జరిగాయా.. లేదా.. అని ప్రశ్న పంపించి.. అసెంబ్లీకి రాకుండా పోతే ఎలా అని వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యంగాస్త్రాలు సంధించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు నాల్గవ రోజు గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయం కొనసాగుతోంది. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. వైసీపీ సానుభూతి పరులపై దాడులు జరుగుతున్న విషయం వాస్తవమేనా అని వైసీపీ వాళ్లు ప్రశ్నవేసి.. సభకు రాలేదని ఎద్దేవా చేశారు. నిజానికి టీడీపీ వాళ్లను చంపి అదేదో తాము చేసినట్టు ఆరోపిస్తున్నారని, అధికారం కోల్పోయి.. 11 సీట్లు సాధించాక టీడీపీ కార్యకర్తలను చంపి ఢిల్లీవెళ్లి అక్కడ దీక్షచేయడం ఏంటని ప్రశ్నించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నలుగురు చనిపోతే ముగ్గురు టీడీపీకి చెందిన వారు ఉన్నారని, దానికి సంభందించి కేసు నెంబర్లతో సహా వెల్లడించామని హోంమంత్రి తెలిపారు.

హత్యలు ఎక్కడ జరిగాయో వివరాలు ఇవ్వండి..

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 36 రాజకీయ హత్యలు జరిగాయని వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారని, వారి పేర్లు చెప్పమంటే మాట్లాడలేదని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అసెంబ్లీకి 36 మంది వివరాలు ఇవ్వవచ్చుకదా.. అలా చేయకుండా ఢిల్లీ ఎందుకు వెళ్ళారని ఆమె ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఆత్మకూరుకు ప్రతిపక్షనేత చంద్రబాబు వెళ్ళాలనుకుంటే ఆయన ఇంటి గేటుకు తాళ్లు కట్టారని, పవన్ కళ్యాణ్ అమరావతి రైతుల వద్దకు వెళితే ముళ్లకంపలు వేశారని, యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌కు స్టూల్ ఎక్కి నిల్చోవడానికి కూడా అనుమతి ఇవ్వలేదని హోంమంత్రి మండిపడ్డారు.

వివరాలు ఇవ్వకుంటే యాక్షన్ తీసుకుంటాం..

వైసీపీ ప్రభుత్వం మీడియాతో పాటు ఎవ్వరినీ వదలలేదు అనే విషయం మర్చి పోకూడదని.. గత అయిదేళ్లల్లో రాష్ట్రంలో ఇలాంటి భయానక వాతావరణాన్ని సృష్టించారని మంత్రి అన్నారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌ను అడుగుతున్న.. 36 మంది చనిపోయారు అని అంటున్నారు. దానికి ఆయన సభకు వచ్చి ఆ వివరాలు ఇవ్వాలని హోంమంత్రి వంగలపూడి అనిత డిమాండ్ చేశారు. తాము చర్యలు తీసుకుంటామని.. అయితే జగన్ ఇచ్చిన వివరాలు తప్పు అని తేలితే ప్రభుత్వం తీసుకునే చర్యలకు భాద్యులవుతారని ఆమె హెచ్చరించారు.

లోకేశ్ రెడ్ బుక్ గురించి వైసీపీ కార్యకర్తలే పట్టించుకోవడం లేదని.. మరి జగన్‌కు ఎందుకు నిద్దర పట్టడం లేదో చెప్పాలని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.

భారత్ క్రీడాకారులకు మద్దతుగా ర్యాలీ.. పతకాల ఆశతో ఉన్నాం - టీజీ

కర్నూలు, జులై 25 : ప్యారిస్ ఒలంపిక్స్ లో భారత క్రీడాకారులు సత్తా చాటి భారతావనికి వన్నె తెస్తారని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ.వెంకటేష్ వాఖ్యానించారు. ఈరోజు ఉదయం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్ బోర్డ్ స్టేడియం ర్యాలీ ప్రారంభ కార్యక్రమంలో టీజీ వెంకటేష్ తో పాటు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లవరం రామాంజ నేయులు తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. దేశ క్రీడా రంగానికి మరిన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైతే క్రీడలు, కళలు, వికసిస్తాయో అక్కడే శాంతి సమగ్రత సౌభ్రాతృత్వం ఉంటుందన్నారు. భారత ఒలంపియన్లకు మద్దతుగా క్రీడా సంఘాలు, క్రీడాకారులు, క్రీడా శ్రేయోభిలాషులు ర్యాలీ చేయడం హర్షనీయమన్నారు. స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ స్టేట్ బ్యాంక్ సర్కిల్, చిన్న పార్క్, కోట్ల సర్కిల్, కోర్స్ కళాశాల మీదుగా కొండారెడ్డి బురుజు వరకు సాగిందన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో క్రీడా సంఘం ప్రతినిధులు హర్షవర్ధన్, నాగరత్నమయ్య, వంశీ నవీన్, గుడిపల్లి సురేందర్, జాఫర్ మున్నా, షేక్షావలి, శ్రీనివాసులు, విజయకుమార్, వేణుగోపాల్, ప్రసాద్, ఎం.ఎం.డి భాష, పరుశురాం, ప్రభాకర్, షకీల్, నవి సాహెబ్, జాకీర్, మధు, చిన్న సుంకన్న, ప్రతాప్ లతోపాటు డి ఎస్ ఏ, సాయి సెంటర్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కస్టమ్స్ సుంకాలలో సంస్కరణలు దేశీయ తయారీకి తోడ్పడతాయి..

న్యూఢిల్లీ, జులై 25 :కస్టమ్స్ సుంకాల పై బడ్జెట్ ప్రతిపాదనలు దేశీయ తయారీకి మద్దతు ఇవ్వడానికి, స్థానిక విలువ జోడింపును పెంచడానికి, ఎగుమతి పోటీతత్వాన్ని ప్రోత్స హించడానికి , పన్నులను సరళతరం చేయడానికి ఉద్దేశించినవి, అదే సమయంలో సాధారణ ప్రజలు , వినియోగదారుల ప్రయోజనాలను పరిగణన లోకి తీసుకుంటాయి – అని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు పార్లమెంటులో తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ప్రాణరక్షక మందుల నుంచి అరుదైన ఎర్త్ మినరల్స్ వరకు వస్తువులపై కొత్త కస్టమ్స్ డ్యూటీ రేట్లను ప్రతిపాదించారు.

క్యాన్సర్ రోగులకు పెద్ద ఉపశమనం కలిగించే విధంగా, ట్రాస్టుజుమాబ్ డెరుక్స్టెకాన్, ఒసిమెర్టినిబ్ ,దర్వాల్యుమాబ్ అనే మూడు మందులను కస్టమ్స్ సుంకాల నుండి పూర్తిగా మినహాయించారు. అంతేకాకుండా, మెడికల్ ఎక్స్-రే యంత్రాలలో ఉపయోగించడానికి ఎక్స్-రే ట్యూబులు , ఫ్లాట్ ప్యానెల్ డిటెక్టర్లపై బిసిడి కూడా తగ్గించారు. , తద్వారా వాటిని దేశీయ సామర్థ్య పెంపుతో సమన్వయ పరచవచ్చు.

గత ఆరేళ్లలో దేశీయంగా మొబైల్ ఫోన్ల ఉత్పత్తి మూడు రెట్లు పెరిగిందని, మొబైల్ ఫోన్ల ఎగుమతులు దాదాపు వంద రెట్లు పెరిగాయని ఆర్థిక మంత్రి తెలిపారు. "వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా, మొబైల్ ఫోన్, మొబైల్ పిసిబిఎ , మొబైల్ ఛార్జర్లపై బిసిడిని 15 శాతానికి తగ్గించాలని నేను ఇప్పుడు ప్రతిపాదిస్తున్నాను" అని ఆర్థిక మంత్రి చెప్పారు.

25 క్రిటికల్ మినరల్స్ పై కస్టమ్స్ సుంకాలను పూర్తిగా మినహాయిస్తున్నట్లు, రెండింటిపై బీసీడీని తగ్గిస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఈ అరుదైన భూమి ఖనిజాలు కీలకమైన అంతరిక్షం, రక్షణ, టెలికమ్యూనికేషన్స్, హైటెక్ ఎలక్ట్రానిక్స్, న్యూక్లియర్ ఎనర్జీ, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలకు ప్రయోజనం చేకూరుసాయి. పునరుత్పాదక ఇంధన రంగానికి మరింత ఊతమిచ్చేలా దేశంలో సోలార్ సెల్స్, ప్యానెల్స్ తయారీలో ఉపయోగించడానికి మినహాయింపు పొందిన క్యాపిటల్ గూడ్స్ జాబితాను విస్తరిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. "అంతేకాకుండా, సోలార్ గ్లాస్ , టిన్డ్ కాపర్ ఇంటర్ కనెక్ట్ ల తగినంత దేశీయ తయారీ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, వారికి అందించే కస్టమ్స్ సుంకాల మినహాయింపును పొడిగించ కూడదని నేను ప్రతిపాదిస్తున్నాను" అని మంత్రి చెప్పారు.

దేశం నుండి సీఫుడ్ ఎగుమతుల పోటీని పెంచడానికి, కొన్ని బ్రూడ్ స్టాక్, పాలిచెట్ పురుగులు, రొయ్యలు , చేపల దాణాపై బిసిడిని 5 శాతానికి తగ్గించాలని మంత్రి ప్రతిపాదించారు. సీఫుడ్ ఎగుమతులను మరింత పెంచడానికి రొయ్యలు, చేపల దాణా తయారీకి సంబంధించిన వివిధ ఇన్పుట్లను కస్టమ్స్ సుంకం నుంచి మినహాయించారు. తోలు, టెక్స్ టైల్ రంగాల్లో ఎగుమతుల పోటీతత్వాన్ని పెంపొందించడానికి వివిధ తోలు ముడి పదార్థాలపై కూడా ఇదే విధమైన తగ్గింపు, మినహాయింపును ప్రకటించారు. ఇంకా, ముడి చర్మాలు, చర్మాలు , తోలుపై ఎగుమతి సుంకం విధింపు విధానాన్ని సరళీకరించాలని , హేతుబద్ధీకరించాలని ప్రతిపాదించారు.

బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి, ప్లాటినంపై సుంకాన్ని 15.4 శాతం నుంచి 6.4 శాతానికి తగ్గించారు. అంతేకాక, స్టీల్ , కాపర్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడానికి ఫెర్రో నికెల్ , బ్లిస్టర్ కాపర్ పై బిసిడి ని తొలగించారు. వాణిజ్య సౌలభ్యం, డ్యూటీ ఇన్వర్షన్ తొలగింపు, వివాదాల తగ్గింపు కోసం కస్టమ్స్ డ్యూటీ రేట్ స్ట్రక్చర్ ను హేతుబద్ధీకరించడానికి, సరళీకరించడానికి వచ్చే ఆరు నెలల్లో సమగ్ర సమీక్ష చేపట్టనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం- నారా భువనేశ్వరి



అమరావతి, జులై 25:వైసీపీ పాలనతో రాష్ట్రం అప్పుల్లో మునిగి పోయిందని, ప్రజలంతా ఓపికతో చంద్రబాబుకు కొంత సమయమిస్తే మీకు అభివృద్ధి కార్యక్రమాలు చేయడంతో పాటు సంక్షేమ పథకాలన్నీ అందిస్తారని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు.

ఆమె కుప్పం నియోజకవర్గంలో మూడవ రోజు పర్యటనలో భాగంగా మాట్లాడుతూ? 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తమ కుటుంబాల కోసం కాకుండా రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆలోచించారని, అందుకే ప్రజా ప్రభుత్వం భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చిందన్నారు. మీ ఓట్లతో ప్రజా ప్రభుత్వాన్ని తీసుకొచ్చారని 2014 పాలన చూసిన మీరు, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలనను కూడా చూశారన్నారు. అందుకే 2024లో మీకు ఏ ప్రభుత్వం అవసరమో ఓట్లతో తీర్పునిచ్చారని ఆమె తెలిపారు. చంద్రబాబు ఉమ్మడి ఏపీలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏవిధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేశారో చూశారని నేడు ఆ ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పౌరులు అనుభవిస్తున్నారని ఆమె తెలిపారు.

రాష్ట్ర విభజన అనంతరం చంద్రబాబు లోటు బడ్జెట్లో రాష్ట్ర పగ్గాలు చేపట్టారు కానీ, రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు నడపిం చేందుకు ప్రయత్నించారని నారా భువనేశ్వరి తెలిపారు. 2019లో అధికారంలోకి రాకపోవడం వల్ల వైసీపీ నేతలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని, నేడు వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను సరిచేసేందుకు చంద్రబాబు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఆమె తెలిపారు. గతంలో కార్యకర్తల కోసం లోకేష్ అనేక కార్యక్రమాలు చేశారని, రానున్న కాలంలో మరిన్ని చేసి మిమ్మల్ని ముందుకు నడిపించే బాధ్యత తమ కుటుంబంపై ఉందన్నారు. తమ కుటుంబంపై మీరు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు నారా భువనేశ్వరి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఇంచార్జి మునిరత్నం, తదితరులు పాల్గొన్నారు.

మూలధన లాభాల పన్ను సరళీకరణ, హేతుబద్ధీకరణ

న్యూఢిల్లీ, జులై 25 :కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2024-25 కేంద్ర బడ్జెట్‌లో మూలధన లాభాల పన్ను సరళీకరణ, హేతుబద్ధీకరణ చేపట్టారు.

బడ్జెట్‌లో ప్రతిపాదించిన దాని ప్రకారం కొన్ని ద్రవ్యపరమైన ఆస్తుల విషయంలో స్వల్పకాలిక లాభాలపై ఇకపై 20 శాతం పన్ను ఉంటుంది. అదే సమయంలో ఇతర అన్ని ద్రవ్యపరమైన ఆస్తులు, ద్రవ్యేతర ఆస్తులకు ఇప్పటివరకు ఉన్న పన్ను రేటే వర్తిస్తుంది.

అన్ని ద్రవ్యపరమైన, ద్రవ్యేతర ఆస్తుల విషయంలో దీర్ఘకాలిక లాభాలపై 12.5 శాతం పన్ను రేటును మంత్రి ప్రతిపాదించారు. అల్పాదాయ, మధ్యతరగతి వర్గాల ప్రయోజనాల కోసం కొన్ని ద్రవ్యపరమైన ఆస్తులపై మూలధన లాభాల మినహాయింపు పరిమితిని ఏడాదికి రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షలకు పెంచాలని ప్రతిపాదించారు.

లిస్టెన ద్రవ్యపరమైన ఆస్తుల విషయంలో ఒక సంవత్సరం కంటే ఎక్కువ సమయాన్ని.. లిస్టు కానీ ద్రవ్యపరమైన ఆస్తులు, ద్రవ్యేతర ఆస్తులన్నింటిని విషయంలో రెండు సంవత్సరాల కంటే ఎక్కువ సమయాన్ని దీర్ఘకాలంగా వర్గీకరించనున్నట్లు బడ్జెట్‌లో పొందుపరిచారు.

హోల్డింగ్ పీరియడ్‌తో సంబంధం లేకుండా లిస్ట్ కానీ బాండ్లు, డిబెంచర్లు, డెట్ మ్యూచువల్ ఫండ్లు, మార్కెట్ లింక్డ్ డిబెంచర్లు ఇప్పటికే ఉన్న రేట్ల వద్ద మూలధన లాభాలపై పన్ను విధించనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు.



అన్ని వర్గాల పెట్టుబడిదారులకు 'ఏంజెల్ ట్యాక్స్' రద్దు

న్యూఢిల్లీ, జులై 25 :కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2024-25 కేంద్ర బడ్జెట్ లో అన్ని వర్గాల పెట్టుబడిదారులకు 'ఏంజెల్ ట్యాక్స్' ను రద్దు చేయాలని ప్రతిపాదించారు. భారత స్టార్టప్ ఎకో సిస్టమ్ ను బలోపేతం చేయడం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల స్ఫూర్తిని పెంపొందించడం, ఇన్నోవేషన్ కు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా ఈ చర్య తీసుకున్నట్లు ఆమె తెలిపారు.

భారతదేశ అభివృద్ధి అవసరాల కోసం విదేశీ మూలధనాన్ని ఆకర్షించడానికి విదేశీ కంపెనీలపై కార్పొరేట్ పన్ను రేటును 40 శాతం నుండి 35 శాతానికి తగ్గించాలని మంత్రి ప్రతిపాదించారు.

ఆర్థిక వ్యవస్థ ఫైనాన్సింగ్ అవసరాలను తీర్చడానికి, పరిమాణం, సామర్థ్యం , నైపుణ్యాల పరంగా ఈ రంగాన్ని సిద్ధం చేయడానికి ఆర్థిక రంగ విజన్ , స్ట్రాటజీ డాక్యుమెంట్ ను తీసుకురానున్నట్లు శ్రీమతి సీతారామన్ ప్రకటించారు. ఇది రాబోయే ఐదేళ్లకు ఎజెండాను నిర్ణయిస్తుందని, ప్రభుత్వం, రెగ్యులేటర్లు, ఆర్థిక సంస్థలు , మార్కెట్ భాగస్వాముల పనితీరుకు మార్గనిర్దేశం చేస్తుందని ఆమె అన్నారు.

క్లైమేట్ ఫైనాన్స్ కోసం వర్గీకరణను అభివృద్ధి చేయాలని మంత్రి ప్రతిపాదించారు. ఇది వాతావరణ అనుసరణ , ఉపశమనానికి మూలధన లభ్యతను పెంచుతుందని భావిస్తున్నారు, ఇది భారతదేశ వాతావరణ కట్టుబాట్లు , హరిత మార్పు ను సాధించడంలో సహాయపడుతుంది.

విమానాలు, నౌకలను లీజుకు ఇవ్వడానికి సమర్థవంతమైన, సౌకర్యవంతమైన విధానాన్ని అందించడానికి, 'వేరియబుల్ కంపెనీ స్ట్రక్చర్' ద్వారా ప్రైవేట్ ఈక్విటీ నిధులను సమీకరించడానికి అవసరమైన చట్టపరమైన అనుమతిని తమ ప్రభుత్వం కోరుతుందని నిర్మలా సీతారామన్ తెలిపారు.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను సులభతరం చేయడానికి, ప్రాధాన్యతను పెంచడానికి , విదేశీ పెట్టుబడులకు భారతీయ రూపాయిని కరెన్సీగా ఉపయోగించే అవకాశాలను ప్రోత్సహించడానికి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు , విదేశీ పెట్టుబడుల నియమ నిబంధనలను సరళతరం చేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు.

పెద్ద సంఖ్యలో నైపుణ్యం కలిగిన కార్మికులకు ఉపాధి కల్పించే డైమండ్ కటింగ్ , పాలిషింగ్ పరిశ్రమ అభివృద్ధిని ప్రోత్సహించడానికి, ముడి వజ్రాలను విక్రయించే విదేశీ మైనింగ్ కంపెనీలకు సేఫ్ హార్బర్ రేట్లను అందించాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు.దేశంలో దేశీయ క్రూయిజ్ లను నిర్వహిస్తున్న విదేశీ షిప్పింగ్ కంపెనీలకు సరళమైన పన్ను విధానాన్ని నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. క్రూయిజ్ టూరిజం అద్భుతమైన సామర్థ్యాన్ని గ్రహించడానికి, దేశంలో ఉపాధిని సృష్టించే ఈ పరిశ్రమకు ఊతమివ్వడానికి ఇది సహాయపడుతుంది.

జీఎస్టీ ఘనవిజయం సాధించి సామాన్యులపై పన్ను భారాన్ని తగ్గించింది: ఆర్థిక మంత్రి

న్యూఢిల్లీ, జులై 25 :కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు పార్లమెంటులో 'కేంద్ర బడ్జెట్ 2024-25'ను ప్రవేశపెడుతూ, జిఎస్టి వాణిజ్యం, పరిశ్రమలకు సమ్మతి భారం, లాజిస్టిక్స్ ఖర్చును తగ్గించిందని, అదే సమయంలో సామాన్యుడిపై పన్ను భారాన్ని తగ్గించిందని అన్నారు. జిఎస్ టి ని ఘనవిజయంగా మంత్రి అభివర్ణించారు.

వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి , జిఎస్టీ చట్టంలో పలు సవరణలు చేశారు.దీని ప్రకారం మద్యం తయారీలో ఉపయోగించే అదనపు తటస్థ ఆల్కహాల్ ను ఈ కేంద్ర పన్ను పరిధి నుంచి మినహాయించనున్నారు. ఐజిఎస్టీ, యూటీజీఎస్టీ చట్టంలోనూ ఇదే తరహాలో సవరణలు చేశారు. ఇంకా , కొత్తగా జోడించిన ఆర్టికల్ 11 ఎ వ్యాపారంలో ప్రబలంగా ఉన్న ఏదైనా సాధారణ పద్ధతి కారణంగా ఈ కేంద్ర పన్నును విధించకుండా లేదా తక్కువగా విధించడాన్ని నియంత్రించడానికి ప్రభుత్వానికి అధికారం ఇస్తుంది.

సిజిఎస్టిలోని సెక్షన్ 16లో రెండు కొత్త ఉప-విభాగాలను చేర్చడం ద్వారా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందే కాల పరిమితి నరళీకృతం చేయబడింది.డిమాండ్ నోటీసులు, ఉత్తర్వులు జారీ చేయడానికి సాధారణ కాలపరిమితిని కూడా సవరించిన చట్టం కల్పిస్తుంది. పన్ను డిమాండ్, వడ్డీ చెల్లింపుతో పాటు పెనాల్టీ తగ్గింపు ప్రయోజనాన్ని పొందడానికి పన్ను చెల్లింపుదారులకు కాలపరిమితిని 30 రోజుల నుంచి 60 రోజులకు పొడిగించారు.

వ్యాపారాన్ని మరింత సులభతరం చేయడానికి, అప్పిలేట్ అథారిటీ వద్ద అప్పీల్ దాఖలు చేయడానికి గరిష్ట ప్రీ డిపాజిట్ మొత్తాన్ని కేంద్ర పన్ను రూ .25 కోట్ల నుండి కేంద్ర పన్ను రూ .20 కోట్లకు తగ్గిస్తున్నారు. అప్పిలేట్ ట్రిబ్యునల్ లో అప్పీల్ దాఖలు చేయడానికి ముందస్తు డిపాజిట్ మొత్తాన్ని గరిష్టంగా రూ.50 కోట్లతో 20 శాతం నుంచి గరిష్టంగా రూ.20 కోట్ల కేంద్ర పన్నుతో 10 శాతానికి తగ్గిస్తున్నారు. అంతేకాకుండా, , అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో అప్పీళ్లను దాఖలు చేయడానికి కాల పరిమితి కూడా 1 ఆగస్టు 2024 నుండి అమలులోకి వచ్చేలా సవరించబడుతోంది. అప్పిలేట్ ట్రిబ్యునల్ పని ప్రారంభించని దృష్ట్యా అప్పీళ్లలో సమయం వృథా కాకుండా ఉంటుంది.

ఇది కాకుండా, అనేక ఇతర మార్పులు చేయబడ్డాయి. ఉదాహరణకు, లాభాపేక్ష నిరోధక కేసులను నిర్ధారించడానికి జిఎస్టి అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను సూచించడానికి ప్రభుత్వానికి అధికారం ఉంది. ఇది వ్యాపార నిర్వహణను సులభతరం చేస్తుంది.

జిఎస్ టి విజయాన్ని ప్రస్తావిస్తూ, జిఎస్ టి ప్రయోజనాలను రెట్టింపు చేయడానికి, పన్ను నిర్మాణాన్ని మరింత సరళీకరించి హేతుబద్ధీకరించామని మరియు మిగిలిన రంగాలకు విస్తరించామని ఆర్థిక మంత్రి చెప్పారు.

భట్టి మాటలన్నీ ఉత్తమాటలే.. అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

నిజామాబాద్, జులై 25 :భట్టి విక్రమార్క చెప్పే మాటలన్నీ ఉత్తమాటలేనని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

సూర్యనారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ అనంతరం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని బద్నామ్ చేస్తూ అసెంబ్లీలో పెట్టిన తీర్మానం వెనుక ఉన్న మతలబ్ ఏంటో తెలంగాణ ప్రజలకు ఈ రోజు తేటతెల్లమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఐదు డిక్లరేషన్లు, 420 హామీల నుండి తప్పించుకునేందుకు రేవంత్ సర్కార్ చేసిన కుట్రలో భాగమే నేడు ప్రవేశపెట్టిన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ నిదర్శనమన్నారు.

తెలంగాణాలో ఇండ్లు లేని నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్న వారికీ కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళల్లో కారం కొట్టిందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో 10ఏళ్ళు మోసం చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మళ్లీ మోసం చేస్తుందని, స్థలం ఉన్నవారికి రూ.5లక్షలు ఎస్సి, ఎస్టీలకు 6లక్షలు నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఇస్తామని దానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఎటువంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచ చేయాలి అని డిమాండ్ చేసారు.

జిల్లాలో పలుచోట్ల ఎక్సైజ్ దాడులు..

ఆదిలాబాద్, జులై 25 :మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండేపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో లక్సెట్టిపేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు (గురువారం) దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 385 కిలోల బెల్లం, 26 లీటర్ల నాటు సారా, 30 లీటర్ల టేబుల్‌ను స్వాధీనం చేసుకుని, 100 లీటర్ల బెల్లం పానీయాన్ని ధ్వంసం చేశారు.

ఆదిలాబాద్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నర్సింహ్మారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కెజి నందగోపాల్ (గురువారం) ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాటు సారా తయారు చేస్తున్న వారిని అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి బెల్లం పట్టికను స్వాధీనం చేసుకున్నట్లు లక్సెట్టిపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.నర్సింహులు తెలిపారు.

ఎక్సైజ్ సర్కిల్ లోని చింతగూడెం, జువ్విగూడ, పొనకల్, జన్నారం, సేవాదాస్ నగర్, తొవ్మిడి గుడిసెలపల్లి, రేండ్లగూడ, దండేపల్లి, తాళ్ల పేట, లింగాపూర్, తానిమడుగు గ్రామాల్లోని షాపులపై ముకుమ్మడిగా ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు.

ఈ దాడుల్లో ఆయా గ్రామాలకు చెందిన భూక్య లలిత, బోడ సావిత్రి, బానావత్ సుజాత, జరుపుల సంగీత, ఎ. నరేష్, ఆకుల శంకరయ్య, పి. కిష్టయ్య, గాజుల స్వామి, బాణావత్ గురువయ్య, బండారి లక్ష్మీనారాయణ, బానావత్ తుకారాం నుంచి 385 కిలోల బెల్లం, 30 కిలోల పటిక, 26 లీటర్ల నాటు సారా పట్టుకున్నట్లు తెలిపారు. 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు వివరించారు.

ఇక ఈ దాడుల్లో సీఐ గంగారెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, లక్షెట్టిపేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్ ఇష్టత్తిరావు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, సాగర్, వెంకటేష్, సుజాత, శిరీష, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్-2024లో తెలంగాణకు"కేంద్రం ఏమిచ్చింది..- గాడిద గుడ్డు"

-కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వినూత్న రీతిలో నిరసన

హైదరాబాద్ జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కేంద్ర బడ్జెట్-2024లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. "కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఏమిచ్చింది..? గాడిద గుడ్డు" అంటూ వినూత్న రీతిలో కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ 8ఎంపీ సీట్లు గెలిచిందని.. అయితే 8సీట్లు ఇచ్చిన రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో దక్కింది మాత్రం గాడిద గుడ్డు అంటూ బ్యానర్ల పై పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే తీవ్రస్థాయిలో చర్చ మొ?దలైంది. బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై బీజేపీ పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

మంత్రి పదవి కోసం పైరవీలు చేయలేదు- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

హైదరాబాద్, జులై 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రేవంత్ రెడ్డి కేబినెట్‌లో మంత్రి పదవి కోసం పైరవీలు చేయలేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. అయ్యేదుంటే ముఖ్యమంత్రి కావచ్చునని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ లాబీలో మాజీ మంత్రులు, బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్రశాంత్ రెడ్డీ, మల్లారెడ్డి, గంగుల కమలకర్, వల్లా రాజేశ్వర్‌రెడ్డితో రాజగోపాల్‌రెడ్డి సంభాషించారు. ఈ సందర్భంగా వారి మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. ఆ క్రమంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గేమ్ ఇప్పుడు స్టార్ట్ అయిందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒకరు జైలుకు వెళ్లే వారి జాబితాలో తొలి స్థానంలో ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వేముల ప్రశాంత రెడ్డి లాంటి వారిని తాము కొనుగోలు చేయలేమన్నారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్... రూ. 20, రూ. 30 కోట్లు ఇచ్చి రేటు ఎక్కువ పెట్టి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. కానీ తాము మాత్రం రూ.5, రూ. 10 కోట్లకు మాత్రమే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడుగుతున్నామని చెప్పారు. అందుకే ఇంకా 26 మంది ఎమ్మెల్యేలు తమతో టచ్‌లోకి రాలేదని స్పష్టం చేశారు. ఇక గతంలో జరిగిన మునుగోడు ఉప ఎన్నికల్లో రూ.300 కోట్లు ఖర్చు చేసి బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించిందని తెలిపారు.మహాభారతంలో కర్ణుడిని ఓడించినట్లు తనను ఆ ఉప ఎన్నికల్లో ఓడించారన్నారు. అయితే మునుగోడు ఉప ఎన్నికల ఎఫెక్ట్ బీఆర్ఎస్‌పై తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ పడిందన్నారు. అందుకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధికారాన్ని కోల్పోయారని ఆయన సోదాహరణగా వివరించారు.

రోజుకోకటి పుట్టుకొస్తున్న కొత్త రకం వైరస్‌లు

హైదరాబాద్ జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్):రోజుకో కొత్త రకం వైరస్‌లు పుట్టుకొస్తున్నాయి. ఉన్నట్లుంది మనిషిలో ఎన్నో మార్పులు.. సాధారణ పరీక్షలకు దొరకడం లేదు. ఏమిటో తెలుసుకునేలోపు మనలో దూరిన వైరస్ ప్రాణంతకంగా మారుతోంది. ఈ మధ్య కాలంలో తెలంగాణ వ్యాప్తంగా కొత్త వైరస్ కలకలం రేపుతోంది. అదే నోరో వైరస్.. ఇటీవల కాలంలో నోరో వైరస్ కేసులు హైదరాబాద్ పరిసరాల్లో ఎక్కువుగా నమోదవుతున్నాయి. అసలు నోరో వైరస్ అంటే ఏంటి.. లక్షణాలు ఎలా ఉంటాయనేది తెలుసుకుందాం. హైదరాబాద్‌లోనే నోరా వైరస్ కేసులు ఎందుకు పెరుగుతున్నాయి.. గత వారం రోజుల వ్యవధిలో పాతబస్తీ ప్రాంతంలో సుమారు వందల సంఖ్యలో నోరో వైరస్ కేసులు నమోదయ్యాయి. కొత్త వైరస్‌ను అంటువ్యాధిగా వైద్యులు గుర్తించారు. ఇది ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. నోరో వైరస్‌ను వింటర్ వామిటింగ్ బగ్ అని కూడా పిలుస్తారు. వానాకాలంలో ఈ వైరస్ సోకుతుంది. ప్రధానంగా అశుభ్రత వలన ఈవైరస్ అభివృద్ధి చెందుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

కేజ్రీవాల్, సిసోడియా, కవితల జ్యూడీషియల్ కస్టడీని పొడగించిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ జూలై 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఎక్సైజ్ స్కామ్ తాలూకు మనీ లాండరింగ్, అవినీతి కేసులో ఢిల్లీ కోర్టు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని గురువారం పొడగించింది. ఈడి దర్యాప్తు చేస్తున్న మనీలాండరింగ్ కేసులో జులై 31 వరకు, సిబిఐ దాఖలు చేసిన అవినీతి కేసులో ఆగస్టు 8 వరకు కేజ్రీవాల్ కస్టడీని ప్రత్యేక జడ్జీ కావేరి బవేజా పొడగించారు.మనీ లాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీపార్టీ నాయకుడు, ఢిల్లీ మాజీ ఉపముఖ్య మంత్రి మనీశ్ సిసోడియా, బిఆర్ఎస్ నాయకురాలు కె. కవిత , ఇతర నిందితుల జ్యుడీషియల్ కస్టడీని కూడా జడ్జీ జులై 31 వరకు పొడగించారు. నిందితులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు ప్రవేశపెట్టారు. సుప్రీం కోర్టు ఇదివరలో ఈడి కేసులో కేజ్రీవాల్ కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. అయినా ఆయన ఇప్పటికీ తీహార్ జైలులో ఉన్నారు. కారణం ఆయన కేసులో బెయిల్ బాండ్ సమర్పించలేదు. ఆయన సిబిఐ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

త్వరలోనే డబుల్ బెడ్ రూం కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం

-అకామ్ సంస్థ ద్వారా మంచినీటిని అందించడం సంతోషం
-డబుల్ బెడ్ రూంలలో నివసించే వారందరి సమస్యలను పరిష్కరిస్తా
-మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్

మెదక్, జులై 25: త్వరలోనే మెదక్ పట్టణం లోని పిల్లికొట్టాల్ డబుల్ బెడ్ రూం కాలనీ యందు సీసీ రోడ్డు నిర్మాణం చేపడ్తానని నియోజకవర్గ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ అన్నారు. గురువారం ఆటోమెటిక్ క్లోరినేషన్ ఆన్ లైన్ మానిటరింగ్, మున్సిపల్ సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన సురక్షితమైన త్రాగునీటి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం నందు త్వరలోనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడ్తామని ఆయన హామీనిచ్చారు. డబుల్ బెడ్ రూంలలో నివసించే వారి సమస్యలను త్వరలోనే తీర్చుతానని ఆయన అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందిస్తున్న అకామ్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, కౌన్సిలర్ లు ఆవారి శేఖర్, దాయర లింగం, వేడి మధుసూదన్, లక్ష్మినారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జ పవన్, ఉప్పల రాజేష్, జీవన్ రావ్, మందుగుల గంగాధర్, పరుశురాం, బాని, సంతోష్, రాగి అశోక్, గోదల సాయి, నరేష్, సమీ, ఎస్.డి. క్రిష్ణ, లక్ష్మణ్, నాగరాజు, అమీర్, మన్నె సుదర్శన్, దుర్గప్రసాద్, పోచేందర్, సంగమేశ్వర్, అశోక్, ఆన్ మోల్ సంస్థ ప్రతినిధులతో పాటు మున్సిపల్ కమీ షనర్ జాకనీశ్రీరాంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వాన బడిలో.. గొడుగు కింద పాఠాలు.. వార్తకు స్పందించిన కలెక్టర్

-పాఠశాలను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించిన కలెక్టర్.

ఆదిలాబాద్, జులై 25 :వెల్లంపల్లి నియోజకవర్గం నిన్నెల మండలం కృష్ణ పల్లి గ్రామంలో విద్యార్థులు పాఠశాలలో గొడుకులు పట్టుకొని కూర్చోవాల్సిన పరిస్థితి చోటు చేసుకొందని, ఆంధ్రప్రభలో వార్త వచ్చింది.

ఈ కథనానికి గురువారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పందించి వెంటనే పాఠశాలను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే మరమ్మత్తులు చేయించాలని, విద్యార్థులకు మంచి బిల్డింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

హీమోఫిలియా బాధితులకు మెరుగైన వైద్యం.. పాలమూరులో అవగాహన

మహబూబ్‌నగర్, జులై 25 : హీమోఫిలియా వ్యాధిగ్రస్తులకు అన్ని రకాల వైద్యం అందుబాటులో ఉందని ప్రభుత్వ జిల్లా వైద్యశాల జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నగ్మా అన్నారు. వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని తెలిపారు. శరీరంలో అంతర్గత రక్తస్రావం జరిగినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. హీమోఫిలియా వేల్ఫేర్ సొసైటీ మహబూబ్ నగర్ జిల్లా అధ్వర్యంలో హస్పిటల్ లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు..ఈ కార్యక్రమంలో ఇంటాస్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ సామాజిక బాధ్యత కింద సమకూర్చిన సుమారు రూ.7 లక్షల విలువైన ఫ్యాక్టర్ 8 ఇంజిక్షన్ లను 30 మంది హీమోఫిలియా బాధితులకు డాక్టర్ నగ్మా పంపిణీ చేశారు. బాధితులకు ఇనిబిటర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వ్యాధిబాధితులకు గాయాలు కాకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు..హస్పిటల్ అర్ఎంఓ డాక్టర్ గణేష్ ,పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ నాగేష్, డాక్టర్ శ్రీపాల్ హీమోఫిలియా లక్షణాలు, సకాలంలో చేపట్టాల్సిన వైద్యం గురించి వివరించారు..

బాధితులకు ప్రభుత్వం జారీ చేసిన అర్ పి డబ్ల్యూ 2016 ప్రకారంగా దివ్యాంగ సర్టిఫికెట్లు జారీ చేయాలని జిల్లా హీమోఫిలియా సొసైటీ కార్యదర్శి సతీష్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో హీమోఫిలియా హైదరాబాద్ సోసైటీ ఉపాధ్యక్షులు అబ్దుల్ రజాక్, జిల్లా హీమోఫిలియా సోసైటీ అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, సతీష్ కుమార్ ఇంటాస్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ అసోషియేట్ కరుణాకర్,కౌన్సిలర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి వద్ద పెరుగుతున్న గోదావరి.. రెండవ ప్రమాద హెచ్చరిక జారీ..

ఖమ్మం, జులై 25 :భద్రాద్రి వద్ద తగ్గుముఖం పట్టిన గోదావరి క్రమక్రమంగా మళ్లీ పెరగడంతో ఏజెన్సీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు.

వాన్తవానికి సోమవారం మధ్యాహ్నం 2.04గంటలకు గోదావరి 48 అడుగులకు చేరుకోవడంతో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

తర్వాత క్రమేపీ పెరుగుతూ మంగళవారం ఉదయం 8 గంటలకు 51.60 అడుగులకు పెరిగిన గోదావరి 11 గంటల నుంచి తగ్గుముఖం పట్టింది.

తెల్లవారుజాము 3.51 గంటలకు 47.9 అడుగులకు తగ్గడంతో రెండవ ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు.

బుధవారం సాయంత్రం 7 గంటలకు 45.2 అడుగుల మేర గోదావరి నిలకడగా ప్రవహించింది. గురువారం ఉదయం 11 గంటల నుంచి మళ్ళీ పెరుగుతూ వస్తుంది. 12 గంటలకు రెండవ ప్రమాద హెచ్చరిక 48 అడుగులకు చేరుకోవడంతో కలెక్టర్ మూడు రోజుల వ్యవధిలో మరోమారు రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గురువారం రాత్రికి 50 అడుగులు వరకు పెరిగే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు పేర్కొన్నారు. మళ్ళీ గోదావరి పెరగడంతో ఏజెన్సీ ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ టీం ఆధ్వర్యంలో లాయక్ పాషా జన్మదిన వేడుకలు

రాజన్న సిరిసిల్ల, జులై 25: (నేటినిజం ప్రతినిధి): టి యు డబ్ల్యూ జె హెచ్ - 143 తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా జన్మదిన వేడుకలను వేములవాడ పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణంలోని ఎస్ టీం ఆధ్వర్యంలో భక్తులకు, యాచకులకు పండ్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఎస్ టీం సభ్యులు మాట్లాడుతూ లాయక్ పాషా నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాల తో జీవించాలని, ఇలాంటి పుట్టినరోజులను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి..

ఆదిలాబాద్, జులై 25 :మంచిర్యాల్ జిల్లా కాసిపేట మండల కేంద్రానికి చెందిన పెంజర్ల లక్ష్మన్ (35) యువకుడు గురువారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.

తన స్కూటీపై సోమగూడెం నుండి ఇంటికి వస్తున్న క్రమంలో సోమగూడెం సుద్దాలవాగు సమీపంలో స్కూటీ అదుపుతప్పి రోడ్ పై పడిపోవడంతో తలకు బలంగా బండరాయి తగలడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించినట్టు సమాచారం.

పోలీసులు కేసు విచారిస్తున్నారు.

బడ్జెట్లో కరీంనగర్ కిచ్చింది "0".. గాడిద గుడ్డు...

-బడ్జెట్ అంతా అంకేల గారడి.. మాయమాటలు... మొక్కుబడి కేటాయింపులు...

- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగా డి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు..

కరీంనగర్, జులై 25 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ జిల్లా అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, నేడు ప్రవేశపెట్టిన బడ్జెట్లో కరీంనగర్ డెవలప్మెంట్ కోసం ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడాన్ని నిరసిస్తూ బిజెపి జిల్లా శాఖ గురువారం సాయంత్రం తెలంగాణ చౌక్ లో నిరసన కార్యక్రమం చేపట్టింది. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడిలా కనిపిస్తుందన్నారు. బడ్జెట్లో కేటాయించిన నిధులన్నీ మొక్కుబడి కేటాయింపులు , మాయమాటల్లా ఉన్నాయన్నారు. లోగడ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు వివిధ రంగాలకు భారీ నిధులు కేటాయిస్తామని ప్రగల్భాలు పలికి నేడు అధికారంలోకి వచ్చాక మొక్కుబడి కేటాయింపులు జరిపిందన్నారు. అలాగే నియోజకవర్గాల ,జిల్లాల అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గానికి 4200 కోట్ల పైచిలుకు నిధులు అభివృద్ధి పనులకు కేటాయించుకుంటే , కరీంనగర్ జిల్లాలోని ఉన్న అన్ని నియోజకవర్గాలకు ఆ విధంగా ఎందుకు నిధులు కేటాయించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇది పూర్తిగా వివక్ష చూపడమేనని, బడ్జెట్లో కూడా కరీంనగర్ జిల్లాకు ఎలాంటి నిధులు కేటాయించకుండా చిన్నచూపు చూశారన్నారు. కరీంనగర్ జిల్లా అభివృద్ధిపై కాంగ్రెస్ నేతలకు చిత్తశుద్ధి లేదని అందుకే జిల్లాకు బడ్జెట్లో "0"నిధులను, గాడిదగుడ్డు తీసుకువచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి , బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు , కల్లెం వాసుదేవ రెడ్డి, రాపర్తి ప్రసాద్ , బొంతల కళ్యాణ్ చంద్ర, కటకం లోకేష్ , దురుశెట్టి సంపత్ , ఎన్నం ప్రకాష్ , ఎడమ సత్యనారాయణ, అలివేలు సమ్మిరెడ్డి , జానపట్ల స్వామి, కార్పొరేటర్లు కోలగని శ్రీనివాస్, దుర్శెట్టి అనూప్, పెద్దపెల్లి జితేందర్. బండ రమణారెడ్డి , నాంపల్లి శ్రీనివాస్, గౌతమ్ రెడ్డి, అనిల్, సమీ పర్వేజ్, ఉప్పరపల్లి శ్రీనివాస్ , ఈసంపల్లి మహేష్ , మాసం గణేష్,రాజు, తదితరులు పాల్గొన్నారు.

భారత్ క్రీడాకారులకు మద్దతుగా ర్యాలీ.. పతకాల ఆశతో ఉన్నాం - టీజీ

కర్నూలు, జులై 25 : ప్యారిస్ ఒలంపిక్స్ లో భారత క్రీడాకారులు సత్తా చాటి భారతావనికి వన్నె తెస్తారని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ.వెంకటేష్ వాఖ్యానించారు. ఈరోజు ఉదయం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్ బోర్డ్ స్టేడియం ర్యాలీ ప్రారంభ కార్యక్రమంలో టీజీ వెంకటేష్ తో పాటు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లవరం రామాంజనేయులు తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. దేశ క్రీడా రంగానికి మరిన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైతే క్రీడలు, కళలు, వికసిస్తాయో అక్కడే శాంతి సమగ్రత సౌభ్రాతృత్వం ఉంటుందన్నారు. భారత ఒలంపియన్లకు మద్దతుగా క్రీడా సంఘాలు, క్రీడాకారులు, క్రీడా శ్రేయోభిలాషులు ర్యాలీ చేయడం హర్షనీయమన్నారు. స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ స్టేట్ బ్యాంక్ సర్కిల్, చిన్న పార్క్, కోట్ల సర్కిల్, కోర్స్ కళాశాల మీదుగా కొండారెడ్డి బురుజు వరకు సాగిందన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో క్రీడా సంఘ ప్రతినిధులు హర్షవర్ధన్, నాగరత్నమయ్య, వంశీ నవీన్, గుడిపల్లి సురేందర్, జాఫర్ మున్నా, షేక్షావలి, శ్రీనివాసులు, విజయకుమార్, వేణుగోపాల్, ప్రసాద్, ఎం.ఎం.డి భాష, పరుశురాం, ప్రభాకర్, షకీల్, నవి సాహెబ్, జాకీర్, మధు, చిన్న సుంకన్న, ప్రతాప్ లతోపాటు డి ఎస్ ఏ, సాయి సెంటర్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో టీబీ విముక్త మున్సిపాలిటీల కోసం 'స్వస్థ నగరం' నమూనా కార్యక్రమం ప్రారంభం

హైదరాబాద్, జులై 25: టీబీ విముక్త మున్సిపాలిటీల ప్రాజెక్టులో భాగంగా తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, పీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లు, పోచారం మున్సిపాలిటీ కలిసి చేపట్టిన 'స్వస్థ నగరం' నమూనా కార్యక్రమం మంగళవారం(23, జూలై, 2024) హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్ - జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్) లో ప్రారంభమైంది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఈ స్థానిక సంస్థలు, తెలంగాణ ఎన్‌టీఈపీ నేతృత్వంలో, తెలంగాణ రాష్ట్ర టీబీ సెల్, కేంద్ర టీబీ విభాగం, ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) ఇండియా, ఇంటర్నేషనల్ యూనియన్ అగైనెస్ట్ టీబీ, లంగ్ డిసీజ్(ది యూనియన్) వధ్వని ఏఐ, యూఎస్ఏఐడీ ఇండియా సంయుక్తాధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం) ఎండీ ఆర్.వి. కర్ణన్ 'స్వస్థ నగరం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ... టీబీ విముక్తి కోసం చొరవ తీసుకునేలా ఈ నమూనా కార్యక్రమం స్థానిక సంస్థలను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో టీబీ సేవల లభ్యత, నాణ్యతపై సమాచారాన్ని పంచుకునేందుకు ఇది బహిరంగ వేదిక అవుతుందని అన్నారు.

అంతర్గత వలసలు, మురికి వాడలు పెరగడం వంటి కారణాల వల్ల టీబీ వ్యాప్తి పెరుగుతోందన్నారు. కేంద్ర టీబీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజేంద్ర పీ జోషి మాట్లాడుతూ... పట్టణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమం చేపట్టడం ద్వారా టీబీ వ్యాధిని నగరాల ఆవల కూడా నియంత్రించడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నమూనాగా చేపట్టేందుకు, తదుపరి హైదరాబాద్ ఆవల ఉన్న పట్టణ ప్రాంతాల్లో అమలు చేయడానికి కేంద్ర టీబీ విభాగం సహకరిస్తుందని ఆయన తెలిపారు.

పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ టీఎస్‌వీఎన్ త్రిల్లేశ్వరరావు మాట్లాడుతూ... ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తమ మున్సిపల్ కార్పొరేషన్ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని, టీబీ నిర్మూలనలో చురుకైన భాగస్వామిగా కొనసాగుతుందని తెలిపారు.

ది యూనియన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి జాజు మాట్లాడుతూ... వ్యాధిగ్రస్థులకు ఉచిత వైద్య సేవలు అందించడం, కుటుంబసభ్యులకు అవగాహన కల్పించడం వంటి చర్యలతో ఈ కార్యక్రమం టీబీపై పోరాటంలో ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు.

టీబీ వ్యాధి పెరగడానికి సామాజిక అంశాలు ప్రధానంగా ప్రభావం చూపే పట్టణ ప్రాంతాల్లో దీనిని నిర్మూలించడానికి, టీబీ విముక్త మున్సిపాలిటీలుగా మార్చడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. పర్యవేక్షణ, నియంత్రణ, టీబీ చికిత్సలో నాణ్యత ఉండేలా చూడటం వంటి అంశాలు ఈ కార్యక్రమంలో ఉంటాయి.

మూడేళ్ల పాటు పీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లు, పోచారం మున్సిపాలిటీలో ఈ నమూనా కార్యక్రమం అమలు చేస్తారు. టీబీ వ్యాప్తిని మూడింట ఒక వంతుకు తగ్గించడం, టీబీ సంబంధ కారణాలతో మరణాలను, వ్యాధి బాధితులు చికిత్స కోసం వెచ్చించే ఖర్చును తగ్గించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యాలు.

వ్యాధి నివారణ కోసం వీలైనంత త్వరగా వ్యాధిని గుర్తించేందుకు గానూ మాలిక్యూలర్ పరీక్షలను పెంచడంతో పాటు డిజిటల్ యాప్‌ను ఉపయోగించి, ఎక్స్-రే ద్వారా టీబీని త్వరగా గుర్తించడంపై ఈ కార్యక్రమం ప్రధాన దృష్టి ఉంటుంది. వలసల కారణంగా వ్యాధి వ్యాప్తి చెందే సమస్య, పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్యంకరమైన అలవాట్లను పెంపొందించడం, డిమాండ్‌కు తగ్గట్టుగా సేవలు అందించేలా ఈ కార్యక్రమం జరుగుతుంది.

'స్వస్థ నగరం'లో భాగంగా వ్యాధి వ్యాప్తి ఉన్న ప్రాంతాలను గుర్తించడం, టీబీ చికిత్స అందించే వారితో చర్చలు, బాల్యంలోనే టీబీని గుర్తించడం, టీబీకి అన్ని రకాల సంపూర్ణ చికిత్స అందించడం, గాలి ద్వారా ఇన్‌ఫెక్షన్ సోకకుండా నివారించడం, టీబీ చికిత్స అందించే సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, వారిలో సామర్థ్యాన్ని పెంపొందించడం, వివిధ రంగాలతో సమన్వయం, పని ప్రదేశాల్లో అవగాహన కోసం పరిశ్రమలు, సంస్థలతో మాట్లాడటం, టీబీ బాధిత కుటుంబాలకు సామాజిక మద్దతు కల్పించడం, వ్యాధిపై పరిశోధన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టీబీ విభాగం జేడీ డాక్టర్ ఏ రాజేశం, యూఎస్ఏఐడీ ఇండియా టీబీ, అంటువ్యాధుల విభాగం చీఫ్ డాక్టర్ అమర్ షా, డబ్ల్యూహెచ్ఓ ఇండియా టీబీ కన్సల్టెంట్ డాక్టర్ మహేశ్, డబ్ల్యూహెచ్ఓ ఇండియా పబ్లిక్, ప్రైవేట్ పార్ట్నర్‌సిప్స్ నేషనల్ ప్రొఫెషనల్ ఆఫీసర్ డాక్టర్ శిబు బాలకృష్ణన్, డబ్ల్యూహెచ్ఓ ఎన్‌టీఈపీ రీజనల్ టీమ్ లీడ్ శాంత అచంట, టీబీ, అంటువ్యాధుల విభాగం చీఫ్ డాక్టర్ అమర్ షా, ప్రాజెక్ట్ డైరెక్టర్ అనీశా సింగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

2023-24 ఆర్థిక సంవత్సరానికి బొగ్గు, లిగ్నైట్ గనుల స్టార్ రేటింగ్ సంబంధించి స్వీయ మూల్యాంకన గడువును పొడిగించిన బొగ్గు మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, జులై 25 :2023-24 ఆర్థిక సంవత్సరానికి బొగ్గు, లిగ్నైట్ గనుల స్టార్ రేటింగ్ కోసం స్వీయ మూల్యాంకనం (సెల్ఫ్ ఎవల్యూషన్) సమర్పించడానికి గడువును 31.07.2024 వరకు పొడిగించాలని బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. గరిష్ట భాగస్వామ్యం కోసం అదేవిధంగా, మరిన్ని గనులు నమోదు చేసుకోవడానికి, స్వీయ మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేయడానికి 15.07.2024 నుండి పొడిగించారు. గనుల మదింపు ప్రక్రియ చేపట్టేందుకు 7 రకాల ప్రమాణాలను చూడటం జరుగుంది. మైనింగ్ నిర్వహణలు, పర్యావరణ సంబంధిత ప్రమాణాలు, టెక్నాలజీల వినియోగం, ఉత్తమ మైనింగ్ పద్ధతులు, ఆర్థిక పనితీరు, పునరావాసం, కార్మిక-సంబంధిత సమ్మతి, భద్రత అంశాల ఆధారంగా మదింపు చేయడం స్టార్ రేటింగ్ విధాన లక్ష్యం.

2023-24 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ కోసం నోటిఫికేషన్ 29 మే 2024 వ తేదీన జారీ చేశారు. రిజిస్ట్రేషన్ కోసం స్టార్ రేటింగ్ పోర్టల్ 01.06.2024 న ప్రారంభమైంది. రిజిస్ట్రేషన్, స్వీయ మూల్యాంకనం సమర్పణకు చివరి తేదీ 15.07 2024 గా నిర్ణయించారు. ఈ ఏడాది గనుల పరిశ్రమ నుంచి గణనీయమైన ప్రతిస్పందన వచ్చింది. 14.07.2024 నాటికే 388 గనుల సంస్థలు పాల్గొనడానికి దరఖాస్తు చేసుకున్నాయి, ఇది 2018-19 లో కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుండి అత్యధిక సంఖ్యలో పాల్గొన్న సంఖ్య.

గనుల మధ్య పోటీతత్వాన్ని ప్రోత్సహించడానికి, చట్టబద్ధమైన నిబంధనలను పాటించడం కోసం, అధునాతన మైనింగ్ సాంకేతికతను వినియోగించడం, ఆర్థిక విజయాల ఆధారంగా వాటి అత్యుత్తమ పనితీరును గుర్తించడానికి బొగ్గు మంత్రిత్వ శాఖ 2018-19 నుండి బొగ్గు, లిగ్నైట్ గనుల కోసం స్టార్ రేటింగ్ విధానాన్ని ప్రారంభించింది.

ఇందులో పాల్గొనే గనుల సంస్థలు సమగ్ర స్వీయ మూల్యాంకన ప్రక్రియను చేపట్టాలి. దీనిని 31, జూలై, 2024 నాటికి పూర్తి చేయాలి. స్వీయ మూల్యాంకనం పూర్తయిన తరువాత, ఒక కమిటీ నిర్వహించే తనిఖీ ద్వారా అత్యధిక స్కోరింగ్ పొందిన గనులలో మొదటి 10% తదుపరి ధ్రువీకరణ కోసం ఎంపిక చేయబడతాయి. మిగిలిన 90 శాతం గనులను కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ ప్రాంతీయ కార్యాలయాలు ఆన్ లైన్ లో సమీక్షిస్తాయి. అక్టోబర్ 31, 2024 నాటికి సమగ్ర సమీక్ష పూర్తవుతుంది. అనంతరం పారదర్శకత, నిష్పక్షపాతంగా కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ తుది సమీక్ష నిర్వహించి 31 జనవరి 2025 లోగా ఫలితాలను విడుదల చేస్తుంది.

బొగ్గు మరియు లిగ్నైట్ మైనింగ్ లో పోటీతత్వాన్ని పెంపొందించడం, బాధ్యతాయుతమైన మైనింగ్ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా దేశంలో మైనింగ్ పనితీరు, సుస్థిరతను పెంచాలని బొగ్గు మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి గని యొక్క సమగ్ర మూల్యాంకనం ఆధారంగా అత్యధికంగా ఫైవ్ స్టార్ నుండి అత్యల్పంగా నో స్టార్ వరకు రేటింగ్స్ ఇస్తారు.

ఇది తిరోగమన బడ్జెట్ - హరీశ్ రావు

హైదరాబాద్, జులై 25: ఎన్నికల్లో గ్యారెంటీల గారడీ.. బడ్జెట్‌లో అంకెల గారడీ గా ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ఉదంటూ ఎద్దేవా చేశారు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత,మాజీ మంత్రి హరీశ్ రావు. బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో నేడు మీడియాతో మాట్లాడుతూ, ఆసరా పెన్షన్‌ల ప్రస్తావన తేకుండా వితంతువులు, వృద్ధులు, వికలాంగులను ప్రభుత్వం నిరాశపర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారుకు పేదల ప్రభుత్వం అని చెప్పుకునే అర్హత లేదని అన్నారు.

ఇది రాష్ట్రాన్ని తిరోగమనం వైపు నడిపే బడ్జెట్ అని హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని గొప్పలకు పోయిన కాంగ్రెస్ సర్కారు.. బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే తేకపోవడం దారుణమని అన్నారు. ఆర్భాటంగా అభయ హస్తం దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆరు గ్యారెంటీ ఊసెత్తలేదని మండిపడ్డారు.

ఆసరా పింఛన్‌లు పెంచుతామని ఎన్నికల్లో హామీలు ఇచ్చారని, వృద్ధుల పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు, వికలాంగుల పెన్షన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. బడ్జెట్‌లో ఆ ప్రస్తావన ఎందుకు చేయలేదని హరీష్‌రావు ప్రశ్నించారు. ఇచ్చిన మాట తప్పడం ద్వారా ప్రభుత్వం పేదలను మోసం చేసిందని విమర్శించారు.

ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఓట్లు దండుకున్న సర్కారు.. ఇప్పుడు రెండు లక్షల ఉద్యోగాల గురించి మాట్లాడలేదని, మాయమాటలతో విద్యార్థులను మోసం చేసిందని హరీష్‌రావు మండిపడ్డారు. ఆటో కార్మికులకు రూ.12 వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా చెప్పారని, ఇప్పుడు ఆ విషయం ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వైఖరి కారణంగా ఇప్పటికే 50 మంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని హరీష్‌రావు గుర్తుచేశారు.

మేనిఫెస్టోను ప్రతిబింబించేలా బడ్జెట్ ఉండాలి కానీ దురదృష్టవశాత్తూ అలా లేదని అన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన నెలకు రూ.2500 సాయం కోసం కోటి మంది మహిళలు ఎదురు చూస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు అయినప్పటికీ మహిళలకు ఆర్థిక సహాయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. . బడ్జెట్‌లో విద్యా భరోసా కార్డు అంశాన్ని ప్రభుత్వం మర్చిపోయిందన్నారు.కొత్త రేషన్ కార్డు ఎప్పటి నుండి ఇస్తారో చెప్పలేదు. జ్యాబ్ క్యాలెండర్ ప్రస్తావన లేదని అన్నారు. హైదరా బాద్ అభివృద్ధిని తాము నిర్లక్ష్యం చేశామని భట్టి పేర్కొనడం పట్ల హరీశ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని బీఆర్ఎస్ కొనసాగించిందని చంద్రబాబు అన్నారు. హైదరాబాద్ డెవలప్మెంట్‌ను సూపర్ స్టార్ రజనీ కాంత్ పొగిడారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి రజనీకి కనిపించింది కానీ కాంగ్రెస్ గజినీలకు కనిపించలేదు అని ఎద్దేవా చేశారు.

కార్గిల్ విజయ్ దివస్‌లో పాల్గొన్న ప్రియాంక ధర్మపురి..

నిజామాబాద్, జులై 25 : 25వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా జమ్మూకాశ్మీర్ స్టడీ సర్కిల్ వారి ఆధ్వర్యంలో గురువారం సీఎంఆర్ సెంట్రల్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్ సతీమణి ప్రియాంక ధర్మపురి పాల్గొన్నారు. అమర వీరుల స్మృతిలో మొక్కను నాటారు.

అనంతరం కార్గిల్ అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పూర్వ సి ఎస్ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఎయిర్ కమాండర్ వి.ఏం రెడ్డి, బీజేపీ తమిళనాడు అధ్యక్షులు అన్నామలై కుప్పుస్వామి, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ లు పాల్గొన్నారు.

ద్యాన యోగ విద్యా పీఠంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



భువనగిరి జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్) గురు పౌర్ణమి పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం, ముగ్దనీపల్లి గ్రామంలో సకల ధ్యాన జ్ఞాన శక్తి సంపదలకు నిలయమైన ఆూఖీ తపోవనంలో స్వయంభుగా వెలసిన స్వయంభు నాగ, కూర్మ, కార్యసిద్ధి విజయ గణపతి, మరియు విశ్వ సాయి, ద్యాన యోగ విద్యా పీఠం లో పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ క్షేత్రంలో స్వయంభు వినాయకుడు, స్వయంభు నాగదేవత, స్వయంభు పుష్కరిణి ఇవన్నీ కూడా స్వయంభుగా వెలసినవి ఇవి శిల్పి చెక్కినవి కావు మరియు ఇక్కడ గుడి ఉండి కాలగర్భంలో కలిసిపోయినవి కావు ప్రథమంగా డిఎస్ఆర్ తపోవన దివ్య శక్తి క్షేత్రంలో 16-09-2013 వ సంవత్సరంలో వెలసినవి. ఈ సందర్భంగా డి ఎస్ ఆర్ తపోవన దివ్య శక్తి క్షేత్రము మరియు ధ్యాన యోగ విద్యా పీఠం వ్యవస్థాకులు ద్యానమైన శ్రీరాములు గురుజీ (ఆూఖీ గురూజీ) నేతృత్వంలో ప్రత్యేక పూజలు, ధ్యానం కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం గురుపూర్ణిమ యొక్క విశిష్టత గురించి వివరించారు.ఈ కార్యక్రమం లో ఆూఖీ తపోవనం మరియు ధ్యాన యోగా విద్యా పీఠం ఇంచార్జి నవీనా రాణి, గ్రామ సర్పంచ్ లక్ష్మి నారాయణ,తో పాటు పెద్ద ఎత్తున పురుషులు, మహిళలు, ద్యానులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారం కోసం బిజెపి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వంపై నిరంతర పోరాటం

–బిజెపిమండల కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడు ఏనుగుల అనీల్



కరీంనగర్, జులై 25 : (నేటినిజం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ శంకరపట్నం మండల కార్యవర్గ సమావేశం స్థానిక లక్ష్మీ ప్రసన్న గార్డెన్లో పార్టీ అధ్యక్షుడు ఎనుగుల అనిల్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశంలో అనీల్ మాట్లాడుతూ ముందుగ ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికలలో పార్టీకి మండలం నుండి అత్యధిక ఓట్లు వేసి గెలిపించిన మండల ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇస్తానన్న హామీలను నామమాత్రంగా అమలు పరుస్తూ ప్రజలను మోసం చేస్తుందని ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందే వరకు బిజెపి నిరంతర పోరాటం చేస్తుందని అనిల్ పేర్కొన్నాడు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి చెన్నమాదవుని నరసింహరాజు మాట్లాడుతూ మోడీ గారి విజయం కోసం బూత్ స్థాయిలో ఏ విధంగా అయితే కష్టపడ్డారో రాబోయే స్థానిక ఎన్నికలలో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకొనుటకు సిద్ధం కావాలని, ఇతర పార్టీల విమర్శలను కార్యకర్తలు తప్పికొట్టాలని పిలుపునిచ్చారుకాగా ఇట్టి సమావేశంలో పలు స్థానిక సమస్యలపై తీర్మాణించడం జరిగింది కల్వల ప్రాజెక్ట్ మరమ్మత్తులు చేయడం.

చింతలపల్లి గ్రామంలో ఎస్సీబీసీ కాలనీలో బ్రిడ్జి నిర్మాణం

మెట్పల్లి ఎస్టీ కాలనీలో బ్రిడ్జ్ కన్నాపూర్ నుండి ఎరడపల్లి వరకు బీటి రోడ్డుముత్తారం నుండి కన్నాపూర్ వరకు బీటి రోడ్డు అర్కండ్ల అర్కండ్ల వంతెన నిర్మాణంగద్దపాక గ్రామంలోని ఎస్సీ కాలనీలో కల్వర్టు నిర్మాణంకేశవపట్నం నుండి వయా కరీంపేట మొగిలిపాలెం వరకు రోడ్డు విస్తరణ కేశవపట్నం నుండి చెర్లపల్లి వరకు బిరోడ్డు ఏర్పాటువంటి పలు స్థానిక సమస్యల పరిష్కారానికి పార్టీ కృషి చేయాల్సిందిగా కోరుతూ అలాగే మండల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ ప్రజలను ఇబ్బందులు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ పలు తీర్మానాలు చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, ప్రధాన కార్యదర్శులు దాసరపు నరేందర్ కొయ్యల అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు జంగా జైపాల్, మండలం కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఖాజాపాషా, వివిధ మోర్చాల అధ్యక్షులు బిజిలి సారయ్య, కనకం సాగర్, గౌరీశెట్టి శ్రీనివాస్, జంగారెడ్డి, నాయకులు కొయ్యడ కుమారస్వామి, రాసమల్ల శ్రీనివాస్, గూళ్ళ రాజు, మారాటి వెంకటేష్, బొజ్జ సాయిప్రకాష్ లతో పాటు శక్తి కేంద్రం ఇంచార్జులు, వివిధ గ్రామాల బూత్ స్థాయి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపేటలో విషాదం – తల్లీ, కుమారుడు బలవన్మరణం

హైదరాబాద్, జులై 25: హైదరాబాద్ కొత్తపేటలో విషాదం చోటు చేసుకుంది. కొత్తపేటలో తల్లీ కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందులతో రాత్రి ఉరేసుకుని తల్లి పద్మ ఆత్మహత్య చేసుకోగా..తల్లి మరణం తట్టుకోలేక కుమారుడు వంశీ సూసైడ్ చేసుకున్నాడు. ఇంట్లో ఉరేసుకుని వంశీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతులను ఒంగోలు వాసులుగా గుర్తించారు.

వివరాలలోకి వెళితే తల్లీ కొడుకుల ఆత్మహత్య.కొత్తపేట లోని ఎస్ఆర్ఎల్ కాలనీ లో అద్దెకు ఉంటున్న ఒంగోలుకు చెందిన గుంజి శివ తన భార్య పద్మ తన ఇద్దరు కుమారులతో కలసి జీవనోపాధి కోసం కొన్నేళ్ల క్రితం ఎస్ఆర్ఎల్ కాలనీ కొత్తపేటకు వచ్చారు. ఈ క్రమంలో గుంజు శివ కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఆర్థిక ఇబ్బందులతో గుంజి పద్మ కొంతకాలం క్రితం కుటుంబ పోషణ, పిల్లల చదువుల ఖర్చులు భరించలేక ఈరోజు రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది.

ఇది చూసిన పెద్ద కొడుకు గుంజి వంశీ (18) కన్న తల్లి ని చూసి ఒక్కసారిగా షాక్ కు గురై తను కుడా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడడం జరిగింది. ఇదంతా క్షణాలలో జరిగిపోవడంతో స్థానికంగా విషాదం అలుముకుంది.

మృతురాలి రెండో కుమారుడు తన తల్లి మరణ వార్త ను స్థానిక బందువులకు, స్థానికులకు తెలియజేయడానికి వెళ్లి వచ్చే సరికి తన అన్న కుడా ఇలా ఆత్మ హత్య కు ఒడిగట్టడం తో, కండ్ల ముందే తల్లి తోడ బుట్టినవాడు ఇలా అర్ధంతరంగా నన్ను ఒంటరిని చేసి వెళ్లి పోయారా అంటూ కన్నీరు మున్నీరుగా విలపించడం జరిగింది.

మొక్కలు నాటండి....

పర్యావరణాన్ని పరిరక్షించండి.... ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయండి....

–టి యు డబ్ల్యూ జే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా

రాజన్న సిరిసిల్ల, జులై 25:(నేటినిజం ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా ప్రజలకు పిలుపునిచ్చారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని జర్నలిస్టుల కాలనీలో వన మహోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా పుట్టినరోజును పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు కాలనీలో జర్నలిస్టులు అంతా కలిసి మొక్కలు నాటారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా లాయక్ పాషా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని హరిత తెలంగాణ తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఒక్క పౌరునిపై ఉందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని అందరం కలిసి దిగ్విజయం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు తాహెర్ పాషా, మోకాల్ల ఎల్లారెడ్డి,మహేష్, , ఎండీ రఫీక్ , సయ్యద్ రసూల్, కొత్వాల్ శ్రీనివాస్ ,జితేందర్ రావు, షేక్ రియాజ్, కృష్ణారెడ్డి, జబ్బార్, దేవరాజ్, ఫహద్ పాషా, ముషాయిద్, గంగాధర్, ప్రవీణ్, రజినీకాంత్, హరీష్, శభాష్,నయిమొద్దీన్, శ్యామ్, జునైద్, విష్ణు, ముస్లిం కమిటీ మాజీ అధ్యక్షులు అక్రమ్ పాషా, మాజీ ప్రధాన కార్యదర్శి ఓలీ మహమ్మద్, యూసుఫ్, షాహిద్, అబ్బు, సదానందం లతో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

– వేములవాడ ఎస్పి శేషాద్రిని రెడ్డి

రాజన్న సిరిసిల్ల, జులై 25:(నేటినిజం ప్రతినిధి): వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజల అప్రమత్తంగా ఉండాలి. వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. వేములవాడ పరిధిలో ఉన్న గంజి వాగును వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్ తో కలసి పరిశీలించిన ఏఎస్పీ గారు.

ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజల అప్రమత్తంగా ఉండాలని,విపత్కర సమయాల్లో సహాయం కోసం డయల్100కి లేదా దగ్గరలో ఉన్న పోలీస్ వారికి సమాచారం అందిస్తే తక్షణ సహాయక చర్యలు చేపట్టడం జరుగుతున్నరు.

వాగులు, వంకలు, నదుల వద్ద వరద ప్రవాహం అధికం గా ఉంటుంది కావున వాటి వద్దకి ఎవరు వెళ్లవద్దని, వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభా లను గాని,వైర్లను గానీ చేతులతో తాక వద్దన్నారు. వాహనాదారులు వర్షంలో ప్రయాణం చేయాల్సి వచ్చినప్పుడు రోడ్లపై నీరు ప్రవహించే చోట అప్రమత్తంగా ఉండాలని,బురద కారణంగా టైర్లు జారి ప్రమాదానికి గురయ్యే అవకాశాలుంటా యన్నారు. గ్రామాలలో పాత ఇండ్లు, గుడిశలలో,శిథిలావస్థలో ఉండే నివాసలలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కూలిపోయే పరిస్థితిలో ఉంటే పోలీస్ వారికి సమాచారం అందిస్తే సురక్షిత ప్రదేశాలకు తరలిస్తామని అన్నారు.ల

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్ల పై వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహించినా అక్కడికి ఎవరు వెళ్లకుండా రెండు దిక్కులా ఫ్లాస్టిక్ కోన్స్,బారిగేడ్స్,హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా ట్రాఫిక్ డైవర్షన్ చేయాడం జరిగిందన్నారు.

పాఠశాలల్లో పచ్చదనం పరిశుభ్రత పాటించాలి

–వ్యాధుల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి.
–సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.
–ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లు, వైద్య సిబ్బంది రాత్రి వేళల్లో అందుబాటులో ఉండాలి.
– జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు .

సంగారెడ్డి, జులై 25 :(నేటినిజం ప్రతినిధి): కల్హేర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, సామాజిక ఆరోగ్య కేంద్రం , నిజాంపేట్ మండలం లోని ట్రైబల్ వెల్ఫేర్ మిని గురుకుల పాఠశాలని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాధుల కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉంటూ, విద్యార్థుల ఆరోగ్యమే ధ్యేయంగా పాఠశాలలో పచ్చదనం –పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, త్రాగునీరు కలుషితం కాకుండా పైప్ లైన్ లీకేజీలను అరికట్టి తద్వారా త్రాగునీరును శుద్ధి చేసి ప్రజలకు అందించాలన్నారు.

సీజనల్ వ్యాధులు నియంత్రణ, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణ సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. ఎక్కడైనా వ్యాధులు ప్రబలితే తక్షణమే వైద్య క్యాంపులు నిర్వహించి వ్యాధుల నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు . ముఖ్యంగా నీళ్లు, ఆహార కల్తీ వల్ల డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయని, ప్రజలు జాగ్రత్తలు పాటించే విదంగా అవగాహన కల్పించాలని అన్నారు . వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అన్ని సంక్షేమ హాస్టళ్లను ప్రత్యేక అధికారులు తనిఖీ చేసి పారిశుద్ధ్యం ఆహార తనిఖీలు చేపట్టాలని పేర్కొన్నారు. దోమలు నివారణ చర్యలు పాటించాలని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రం చేయు విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతి పాఠశాలల్లో అవెన్యూ డ్రైవ్ చేపట్టాలని అన్నారు. నాటిన ప్రతి మొక్కను జియో టాకింగ్ చేయాలని సూచించారు. నూటికి నూరు శాతం మొక్కలు నాటి పచ్చదనం విస్తరించే విధంగాగా ఉండాలని అన్నారు. వైద్యులు, సిబ్బంది అందరూ సమయ పాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన సేవలు అందించేలా అంకిత భావం తో విధులు నిర్వర్తించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. రాత్రి వేళల్లో డాక్టర్లు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రులకు మాత్రమే రోగులను పంపాలని, ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులను పంపించవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఆర్ డి ఓ అశోక్ చక్రవర్తి, తహసీల్దార్లు నాగజ్యోతి, వెంకటేశ్వర్లు, ఎంపిడి ఓ శ్రీనివాసులు, ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ అనిల్ రెడ్డి , గురుకుల ఉపాధ్యాయులు నిర్మల,పుష్పలత, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

ఋణమాఫీ డబ్బులు రైతుల ఖాతాలలో వెంటనే జమ చేయాలి

–రుణమాఫీ అయిన రైతుల ఋణాలు రెన్యువల్ చేసి కొత్త ఋణాలు మంజూరు చేయాలి.
–కల్హేర్ ఎస్బిఐ బ్యాంకు , ప్రాథమిక పాఠశాల ను, అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.

సంగారెడ్డి, జులై 25 :(నేటినిజం ప్రతినిధి):బుధవారం మండల కేంద్రమైన కల్హేరులోని ఎస్బిఐ బ్యాంక్ ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఋణమాఫీ, రుణాల రెన్యువల్ ప్రక్రియలను పరిశీలించారు. బ్యాంకు పరిధిలో మొత్తం ఎంతమంది రైతులకు ఋణమాఫీలు లబ్ధి పొందారు అన్న వివరాలను బ్యాంకు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రూ. ఒక లక్ష లోపు రుణాలు ఉన్న 660 మంది రైతులకు ఋణమాఫీ వచ్చిందని బ్యాంక్ మేనేజర్ జాదవ్ సంతోష్, కలెక్టర్ కు తెలిపారు. ఇప్పటివరకు 120 మంది రైతుల బ్యాంకు సేవింగ్ ఖాతాలలో రూ. ఒక కోటి రూపాయలు జమ చేసినట్లు తెలిపారు మిగిలిన 440 మంది రైతుల ఋణమాఫీ డబ్బులు వారి సేవింగ్ ఖాతాలలో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఋణాలు సైతం చేస్తున్నట్లు తెలిపారు రైతులు 1బి తీసుకురాగానే వెంటనే షెడ్యూల్ చేసి రుణమాఫీ డబ్బులు రైతులకు అందజేస్తున్నట్లు బ్యాంకు సిబ్బంది కలెక్టర్కు తెలిపారు. వ్యవసాయ అధికారులు గ్రామాలలో గ్రామసభలు ఏర్పాటుతో రైతులకు రుణమాఫీ పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బ్యాంకు వద్ద ఆమె రైతులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ చేసి తిరిగి కొత్త రుణాలు ఇప్పించడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

అనంతరం కల్హేర్ ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసారు.

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మండల కేంద్రమైన కల్హేర్ లోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాలలో మూడవ తరగతి ,నాలుగవ తరగతి విద్యార్థులతో ఆమె మాట్లాడారు ఈ సందర్భంగా విద్యార్థులకు గుణిజాలు చదివిపించారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు అంగన్వాడి కేంద్రంలో బాలింతలకు గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు అంగన్వాడి కేంద్రం పరిధిలో ఆరుగురు గర్భిణీ స్త్రీలు ముగ్గురు బాలింతలు ఉండగా ఆరుగురు అంగన్వాడి కేంద్రానికి వచ్చి భోజనం చేస్తున్నట్లు అంగన్వాడి టీచర్ తెలిపారు ముగ్గురు బాలింతలు వ్యవసాయ పనుల కారణంగా భోజనాన్ని మధ్యాహ్నం ఇంటికి తీసుకు వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో. ఆర్ డి ఓ అశోక చక్రవర్తి, ఎల్ డి ఎమ్ గోపాల్ రెడ్డి ,ఎమ్ ఇ ఓ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్వానము
తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ సాహిత్య అకాడమి
గౌ॥ శ్రీ రేవంత్ రెడ్డి గారు, ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ కొండా సురేఖ గారు, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖామాత్యులు
డా. దాశరథి కృష్ణమాచార్య
శతజయంతి వేడుకలు
22.7.2024 నుండి 27.7.2024 వరకు
వేదికలు: రవీంద్రభారతి, మహిళా విశ్వవిద్యాలయం, ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, నిజాం కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం
దాశరథి సాహిత్య సమాలోచన
దాశరథి శతజయంతి ప్రత్యేక సంచిక 'పునాస' ఆవిష్కరణ
అందరూ ఆహ్వానితులే
తేది: 23.07.2024
సమయం : ఉ.10.00 గంటలకు
వేదిక: తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, కోఠి
సభాధ్యక్షులు: ఆచార్య వెలుదండ విద్యానందరావు, తెలుగుశాఖ అధ్యక్షులు, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం
ముఖ్య అతిథి: ఆచార్య బి. గౌరీశంకర్, పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం
ప్రత్యేక ప్రసంగం: డా. సంగవభట్ల నర్సయ్య, పూర్వ ప్రధానాచార్యులు, ఓరియంటల్ కళాశాల, ధర్మపురి
ఆంశం : పద్యకవిగా దాశరథి
గౌరవ అతిథి: ఆచార్య ఎం. విజ్జాత, ఉపాధ్యక్షులు, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, కోఠి (ఇంచార్జి)
విశిష్ట అతిథి: ఆచార్య టి. సరస్వతమ్మ, ప్రత్యేక అధికారిణి, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, కోఠి
ఆచార్య మసన చెన్నప్ప, విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం
డా. గంధ్ర లక్ష్మణరావు, విశ్రాంత ఉపన్యాసకులు
ఆత్మీయ అతిథులు: శ్రీమతి దాశరథి ఇందిర, దాశరథి కుమార్తె
తేది: 24.07.2024
సమయం : ఉ.10.00 గంటలకు
వేదిక: ప్రభుత్వ సిటీ కళాశాల, నయాపూల్
సభాధ్యక్షులు: డా. కోయి కోటేశ్వరరావు, తెలుగుశాఖ అధ్యక్షులు, ప్రభుత్వ సిటీ కళాశాల
ముఖ్య అతిథి: శ్రీమతి ఎ.వాణీ ప్రసాద్, ఐఏఎస్, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, యువజన, పర్యాటక, సాంస్కృతిక, క్రీడలు
ప్రత్యేక ప్రసంగం: అబ్దుల్ వాహిద్, పాత్రికేయులు, సాహితీవేత్త
ఆంశం : దాశరథి ఆశువాది గేయకవిత్వం
గౌరవ అతిథి: ఆచార్య పి.బాలభాస్కర్, ప్రధానాచార్యులు, ప్రభుత్వ సిటీ కళాశాల
విశిష్ట అతిథి: ఆచార్య పుంజాల అలేఖ్య, చైర్పర్సన్, తెలంగాణ సంగీత నాటక అకాడమి
ఆత్మీయ అతిథులు: శ్రీ. టి. ఉదయవర్లు, కార్యదర్శి, శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం
సాయంత్రం 5.00గంటల నుండి ప్రత్యేక కార్యక్రమం
వేదిక: రవీంద్రభారతి, మెయిన్హాల్
డా.వి.వి.రామారావు, బృందంచే
దాశరథి సినిగీతాల స్వరనీరాజనం
తేది: 25.07.2024
సమయం : ఉ.10.00 గంటలకు
వేదిక: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, గచ్చిబౌలి
సభాధ్యక్షులు: ఆచార్య పిల్లలమర్రి రాములు, తెలుగుశాఖ అధ్యక్షులు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం
ముఖ్య అతిథి: ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, పూర్వ ఉపాధ్యక్షులు, తెలుగు విశ్వవిద్యాలయం
ప్రత్యేక ప్రసంగం: డా. నాళేశ్వరం శంకరం, విశ్రాంత ఉపన్యాసకులు
ఆంశం : వచన కవితా కవిగా దాశరథి
గౌరవ అతిథి: డా. మామిడి హరికృష్ణ, సంచాలకులు, భాషా సాంస్కృతికశాఖ
విశిష్ట అతిథి: శ్రీ మోత్కూరి నరహరి, పూర్వ ప్రధానాచార్యులు, తెలంగాణ సారస్వత పరిషత్తు ఓరియంటల్ కళాశాల
ఆత్మీయ అతిథులు: శ్రీ. దాశరథి లక్ష్మణ్, దాశరథి కుమారులు
తేది: 26.07.2024
సమయం : మ. 2.00 గంటలకు
వేదిక: ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఆర్ట్స్ కళాశాల
సభాధ్యక్షులు: ఆచార్య సూరి కమలాకర-శర్మ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ముఖ్య అతిథి: డా. నందిని సిధారెడ్డి, పూర్వ అధ్యక్షులు,తెలంగాణ సాహిత్య అకాడమి
ప్రత్యేక ప్రసంగం: డా. వి.వి.రామారావు, వ్యాఖ్యాత, ఆకాశవాణి; డా. తిరుపగిరి శరత్చంద్ర, సాహిత్య పరిశోధకులు
ఆంశం: స్వీయ గేయ కవితా దాశరథి
గౌరవ అతిథి: శ్రీ బైసా దేవదాసు, సంపాదకులు, నేటినిజం
విశిష్ట అతిథి: ఆచార్య సూర్య ధనంజయ్, ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం; ఆచార్య కాశీం, ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం; డా. బాణాల భుజంగరెడ్డి, సహాయ ఆచార్యులు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథులు: డా. గంటా జలంధర్రెడ్డి, ఉపన్యాసకులు, ప్రభుత్వ కళాశాల ఖైరతాబాద్; శ్రీ దైవజ్ఞశర్మ, ఆధ్యాత్మికవేత్త
తేది: 27.07.2024
సమయం : ఉ.10.00 గంటలకు
వేదిక: నిజాం కళాశాల, బషీర్బాగ్
సభాధ్యక్షులు: డా.వేల్పుల కుమారస్వామి, తెలుగుశాఖ అధ్యక్షులు, నిజాం కళాశాల
ముఖ్య అతిథి: డా. కె. శ్రీనివాస్, సంపాదకులు, ఆంధ్రజ్యోతి దినపత్రిక
ప్రత్యేక ప్రసంగం: డా. ఎం. దేవేంద్ర, ఉపన్యాసకులు, మహిళా విశ్వవిద్యాలయం
ఆంశం: కథాత్మక వచన రచయితగా దాశరథి
గౌరవ అతిథి: ఆచార్య భీమ, ప్రధాన ఆచార్యులు, నిజాం కళాశాల
విశిష్ట అతిథి: డా. ఎస్. రఘు, సహాయ ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథులు: శ్రీమతి జూపాక సుభద్ర, ప్రముఖ కవయిత్రి
నిర్వహణ: డా.నామోజు బాలాచారి, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్-500004, ఫోన్: 040-29703142

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.